


www.aksharamtelugudaily.com

RNI NO: TELTEL/2018/75419

సుఫల అక్షరం
సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక
SUPHALA AKSHARAM

SUNDAY 15TH FEBUARY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 08 ISSUE : 314 COST : 3\- KHAMMAM, TELANGANA

ఆదివారం 15 పిబ్రవరి 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 314 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## రైతు భరోసా విడుదలకు రంగం సిద్ధం

హైదరాబాద్,ఫిబ్రవరి14 తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు శుభవార్త చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల పక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున

➢ 2వ పేజీలో..

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

- మున్సిపల్ ఫలితాలపై పార్టీ నేతలతో సిఎం రేవంత్
- గెలిపించిన సీనియర్ మంత్రులకు అభినందనలు
- భద్రాద్రి కొత్తగూడెంపై కుదిరిన అవగాహన
- మేయర్ సిపిఐకి, డిప్యూటి మేయర్ కాంగ్రెస్‌కు
- సిఎం రేవంత్‌తో పల్లా వెంకట్ రెడ్డి భేటీలో నిర్ణయం



హైదరాబాద్,ఫిబ్రవరి14(అక్షరం న్యూస్) తెలంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. మనపట్ల ప్రజల నమ్మకం పెరిగేలా అభివృద్ధి సాగాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ చేయడమే కాకుండా.. నిజామాబాద్, కొత్తగూడెం కార్పొరేషన్లలో మేయర్ పీఠాలను కైవసం చేసుకునే వ్యూహాలపై దిశానిర్దేశర చేశారు. మంచి ఫలితాలు సాధించారని మంత్రులు, సీనియర్ నేతలను అభినందించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకెళ్లాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఫలితాలను బేరీజు వేసుకుని మరింతగా పార్టీని పటిష్టం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. హంగ్ అసెంబ్లీలు ఉన్నచోట వాటిని దక్కించుకునేలా వ్యూహాత్మకంగా కదలాలని అన్నారు. ఇందులో మంత్రులు, పిసిసి చీఫ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంచి ఫలితాలు వచ్చినా, నిజామాబాద్, కొత్తగూడెంలలో మేయర్ పదవులను దక్కించుకోవడంపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. నిజామాబాద్‌లో మేయర్ పీఠం దక్కించుకునేందుకు ఎంఐఎం పార్టీతో చర్చలు జరపాలని పీసీసీ చీఫ్‌కు సీఎం రేవంత్ సూచించారు. కొత్తగూడెంలో స్వతంత్ర అభ్యర్థులు, ఇతర చిన్న పార్టీల మద్దతు కూడగట్టి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల

➢ మిగతా 2వ పేజిలో..



## అమెరికా ఒప్పందంతో రైతులకు తీవ్ర నష్టం

- వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారు
- ఒప్పందంపై భ్రమలు కల్పిస్తున్న ప్రధాని మోదీ
- కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14 అక్షరం న్యూస్) అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రధాని, ఆయన కేబినెట్ మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని ఆయన ఎక్స్‌లో దుయ్యబట్టారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ

➢ మిగతా 2వ పేజిలో..

## ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు

- మోదీ ప్రభుత్వం వాళ్ల ఇంటికెళ్లి కొట్టింది
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శలు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి14 కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలనలో ఉగ్రదాడులకు సరైన సమాధానం దొరకలేదని, మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెప్పిందని వ్యాఖ్యానించారు. 2019 ఫిబ్రవరి 14 జరిగిన పుల్వామా ఉగ్రదాడిని ఉటంకిస్తూ, ప్రతీకారం తీర్చుకునే కొత్త సంప్రదాయానికి మోదీ శ్రీకారం చుట్టారని షా పేర్కొన్నారు. యూపీఏ పాలనలో పాకిస్థాన్ ఉగ్రవాదులు, భారత సైనికులపై తీవ్ర స్థాయిలో దాడులు జరిపారని ఆరోపించారు. కానీ మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన సైనికులు, శత్రువుల భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాదులను అంతమొందించారని చెప్పారు. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని

➢ మిగతా 2వ పేజిలో..

## దేశ భద్రతను కాంగ్రెస్ ప్రమాదంలో పడేస్తుంది

- ఈశాన్య ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తున్నాం!
- అసోంకు కీలకం కానున్న రాబోయే ఐదేళ్లు
- ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి14 కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనేవారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేయాలని నినాదాలు చేసేవారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని విమర్శించారు. దేశాన్ని విభజించాలనుకునేవారే కాంగ్రెస్ ఆరాధకులుగా మారుతారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ముస్లిం లీగ్ దేశాన్ని విభజించిందని, ఇప్పుడు నేటి కాంగ్రెస్ 'ముస్లిం లీగ్ మావోయిస్టు కాంగ్రెస్'గా మారిందని దుయ్యబట్టారు. అందుకే కాంగ్రెస్ పట్ల అసోం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసోం ఆకలితో అలమటించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. అలాగే భయం గుప్పిట్లో ఉందన్నారు. అభివృద్ధి కోసం

➢ మిగతా 2వ పేజిలో..

## మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

- ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే
- అయినా గణనీయంగా తమ బలాన్ని పెంచుకున్నాం
- మీడియాతో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



హైదరాబాద్,ఫిబ్రవరి14 తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్స్‌అఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన

➢ మిగతా 2వ పేజిలో..

## అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా పరుగులు

- రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు
- రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు
- మూలధన వ్యయం రూ. 53,915 కోట్లగా అంచనా
- రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు
- విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు
- రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు
- ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు
- జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు
- మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు రూ.9,906 కోట్లు
- అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు
- పోలవరం రూ.6,105 కోట్లు కేటాయింపు
- విభజన సమస్యలతో పాటు, గత ఐదేళ్ల నష్టాలను అధిగమించేలా ముందుచూపు
- బడ్జెట్ అంటే కేవలం లెక్కలు మాత్రమే కాదు
- బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



అమరావతి,ఫిబ్రవరి14 2026-27కు సంబంధించిన వార్షిక బ్జడెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.3,32,205 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు ఏపీ అసెంబ్లీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం

➢ మిగతా 2వ పేజిలో..

## విచారించండి

- ఫార్ములా ఈ రేస్ లో కీలక పరిణామం..
- ప్రాసిక్యూషన్ కు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- అర్వింద్ కుమార్ ను విచారణకు పిలుపు

హైదరాబాద్,ఫిబ్రవరి14 తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటి వరకు ఫోన్ ట్యాపింగ్, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలతో తెలంగాణలో రాజకీయాలు హీటెక్కిన విషయం తెలిసిందే. ఫార్ములా ఈ రేసింగ్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుంది. ఇప్పటికే దీనిలో కేటీఆర్ ను పలు మార్లు అధికారులు విచారించారు. తాజాగా..

➢ మిగతా 2వ పేజిలో..

# దేశ భద్రతను కాంగ్రెస్ ప్రమాదంలో పడేస్తుంది

➢ మొదటి పేజీ తరువాయి

నిధులు ఇవ్వకుండా తప్పించుకునే హస్తం పార్టీ అసోంను అభివృద్ధి చేయగలదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కేంద్రం నుంచి అసోం పన్ను వాటాగా రూ.10,000 కోట్లు మాత్రమే అందుకునేదన్నారు. ఇప్పుడు బీజేపీ సర్కార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కన్నా 5 రెట్లు ఎక్కువను పన్ను వాటాగా అందుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విస్మరించిన ఈశాన్య ప్రాంతాలకు తాము భక్తితో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ అసంతృప్తికి అతిపెద్ద కారణం ఓటు బ్యాంకు రాజకీయాలే. హస్తం పార్టీ ఎప్పుడూ అసోంను ఎన్నికల కోణంలోనే చూసింది. ఆ పార్టీ హయాంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అసోంకు చేరడానికి సంవత్సరాల కాలం పట్టింది. కానీ బీజేపీ ఎల్లప్పుడూ అసోం, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూనే ఉంది. కొంతకాలం క్రితం దేశంలో మొట్టమొదటి స్లీపర్ వందే భారత్ రైలు అసోం నుంచే ప్రారంభమైంది. సెమీకండక్టర్ రంగంలో అసోం వృద్ధి ఇంజిన్‌గా మారుతోంది. ఇక్కడ తయారయ్యే చిప్‌ల గురించి అసోం టీ లాగా ప్రపంచవ్యాప్తంగా చర్చించుకునే రోజు ఎంతో దూరంలో లేదు. ఆ రాష్ట్ర వృద్ధి ప్రయాణాన్ని చాయ్ నుంచి చిప్స్ వరకు చూడవచ్చని అన్నారు. కాంగ్రెస్ హయాంలో 3జీ, 4జీ టెక్నాలజీ వచ్చిందని, అలాగే 2+ స్కామ్ కూడా వచ్చిందని మోదీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో ఎయిమ్స్‌ల గురించి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో అసోంలో హింస, వేర్పాటువాదం ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలో ఎన్?డీఏ సర్కార్ శాంతి, శ్రేయస్సు, వేగవంతమైన అభివృద్ధి అనే సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఒకప్పుడు బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన అసోంలో ఇప్పుడు శాంతి నెలకొందన్నారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఈశాన్య ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని మోదీ మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్?డీఏ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అష్టలక్ష్మిగా పరిగణిస్తుందని అన్నారు. అసోంలో మౌలిక సదుపాయాల పెంపుదలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాంగ్రెస్ భారత్‌ను ఒక దేశంగా పరిగణించడానికి కూడా నిరాకరిస్తుందని, భారతమాత పట్ల కనీస గౌరవం కూడా చూపదని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తగా ఉండటం తన జీవితంలోని గొప్ప గౌరవం అన్నారు. "2014 నాటికి దేశంలో కేవలం 6 ఎయిమ్స్‌లు మాత్రమే ఉన్నాయి. ఆ ఏడాదే దేశానికి సేవ చేసే అవకాశాన్ని ప్రజలు నాకు ఇచ్చారు. ఆ తర్వాత కాలంలో ఎయిమ్స్‌ల సంఖ్య భారీగా పెరిగింది. బీజేపీ సర్కార్ గువాహటిలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసింది. నిన్ననే 'పీఎం-రాహత్' పథకానికి ఆమోదం తెలిపాం. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా, ఎవరైనా ప్రమాదంలో గాయపడితే కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్సను అందిస్తుంది. గత 11 ఏళ్లలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం అసోంకు కేంద్ర ప్రభుత్వం రూ.5.5 లక్షల కోట్లకు పైగా నిధులను కేటాయించింది. ఈశాన్య ప్రాంతాల కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాం. కనెక్టివిటీ పెరిగే కొద్దీ ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇటీవల గువాహటిలో పరీక్ష పే చర్చ కార్యక్రమం జరిగింది. బ్రహ్మపుత్ర నదిపై క్రూయిజ్‌లో విద్యార్థులతో నేను చర్చించాను. రాబోయే ఐదేళ్లు అసోంకు చాలా కీలకం." అని మోదీ పేర్కొన్నారు. అసోం అభివృద్ధిలో, ప్రజల జీవితాల్లో బ్రహ్మపుత్ర నదిది ప్రముఖ పాత్ర అని మోదీ పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ 70 ఏళ్ల పాలనలో బ్రహ్మపుత్ర నదిని దాటడం ఎల్లప్పుడూ పెద్ద సవాలుగా ఉండదేదని ఆరోపించారు. దాదాపు 7 దశాబ్దాల పాలనలో ఆ పార్టీ బ్రహ్మపుత్ర నదిపై కేవలం 3 వంతెనలను మాత్రమే నిర్మించాయన్నారు. గత 10-11 ఏళ్లలో బీజేపీ సర్కార్ బ్రహ్మపుత్ర నదిపై ఐదు పెద్ద వంతెనలను పూర్తి చేసిందని తెలిపారు. కాంగ్రెస్ అసోంకు సమస్యలను మాత్రమే ఇచ్చిందని, బీజేపీ మాత్రం వాటికి పరిష్కారాలను చూపిందన్నారు.

# మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

➢ మొదటి పేజీ తరువాయి

మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. ఫార్ములా కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఐదుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.

# ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు

➢ మొదటి పేజీ తరువాయి

కారైకల్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో అమిత్ షా ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు నివాళులర్పించారు.పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళులు అర్పిస్తున్నాను. కాంగ్రెస్ పాలనలో, పాకిస్థాన్ ఉగ్రవాదులు ప్రతిరోజూ మన సైనికులపై దాడి చేసేవారు. దీనిపై దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి లేదా రక్షణ మంత్రి నుంచి ఎటువంటి స్పందన ఉండేది కాదు. కానీ పుల్వామా దాడికి ప్రతీకారంగా మోదీ ప్రభుత్వం వైమానిక దాడులు చేసింది. పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించి, ఉగ్రవాద స్థావరాలను మట్టికరిపించింది. ప్రధాని మోదీ హయాంలో మొదట సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్?తో పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చిందని అన్నారు. మరోవైపు, పుదుచ్చేరిలోని బీజేపీ బహిరంగ సభలో పాల్గొన్న అమిత్? షా ఆ ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు రావడానికి రెండు లక్ష్యాలు ఉన్నాయని? షా పేర్కొన్నారు. అందులో మొదటిది మోదీ, రంగ స్వామి నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్? సాధించిన విజయాలను ప్రజల ముందు ఉంచడానికని, రెండోది అవినీతి శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖూూ - ×చీణ× కూటమిల ముసుగును బయటపెట్టడానికని షా వ్యాఖ్యానించారు. ఐదు సంవత్సరాల క్రితం, పుదుచ్చేరి ప్రజలు ప్రధాని మోదీ, రంగస్వామి నాయకత్వంలో ఇక్కడ ఎన్?డీఏ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. భారత్?ను సుసంపన్నంగా, సురక్షితంగా మార్చడానికి ప్రధాని మోదీ కృషి చేశారు. పుదుచ్చేరి ప్రజలు ఎన్?డీఏ, బీజేపీ, రంగస్వామి, ప్రధాని మోదీపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో, పుదుచ్చేరి ప్రజలు 44% ఓట్లను గెలుచుకుంది. కానీ ఈసారి బీజేపీ, ఎఐఎన్?ఆర్?సీ, ఎఐఎడీఎంకే కూటమి 60% ఓట్లతో సీట్లను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే పుదుచ్చేరిలో ఎన్?డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధానంగా మూడు పనులు చేసింది. అందులో మొదటిది అవినీతిని అంతం చేయడం, రెండోది పుదుచ్చేరిని స్వయంప్రతిపత్తి కలిగిన కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం, మూడోది పుదుచ్చేరికి రాజకీయ స్థిరత్వాన్ని తీసుకురావడం వంటి పనులు చేసింది." అని అమిత్? షా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ జవాన్లపై జరిగిన ఉగ్రదాడిని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. జవాన్ల ప్రాణ త్యాగాన్ని భారత్ ఎన్నటికీ మరిచిపోదన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టే మన భద్రతా దళాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువని, దానిని పూర్తిగా నిర్మూలించేందుకు భారత్ కట్టుబడి ఉందని మోదీ పేర్కొన్నారు.

## విచారించండి

ఈ కేసులో ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ను విచారించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫార్మ్యూల్ ఈ రేసింగ్ లో భారీగా డబ్బులు అడ్డగోలుగా చేతులు మారాయని అవినీతి నిరోధక శాఖ గతంలోనే కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ని విచారణకు గతంలోనే తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతిని ఇచ్చారు. తాజాగా సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్ విషయంలో కేంద్రం అనుమతి ఇచ్చింది. దీంతో ఏసీబీ ఆయనపై కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు సమాయత్తం అవుతుంది. ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 , ఏ5గా ఎఫ్ఈవో ప్రతినిధులు ఉన్నారని తుది నివేదికలో స్పష్టం చేసింది. క్విడ్ ప్రొ కో జరిగిందని అధికారులు ఆరోపణలు చేశారు. ట్రైపార్టీ అగ్రిమెంట్ కు ముందే బీఆర్ఎస్ కు ఈ బాండ్లు చెల్లించారని ఏసీబీ ఆరోపించింది. కేటీఆర్ సైతం ఇప్పటికే ఫార్ములా ఈ అనే అంశాన్ని ప్రభుత్వం తెర మీదికి తీసుకొస్తున్నారు. ఇప్పటికే నాలుగు సార్లు పిలిచి వాళ్లు చేసింది ఏమీ లేదన్నారు. కేవలం మరోసారి వేధింపులలో భాగంగా పిలవబోతున్నారన్న సమాచారం ఉందన్నారు. ఎన్ని సార్లు పిలిచినా భయపడేది లేదని, సత్యమే చెప్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# అమెరికా ఒప్పందంతో రైతులకు తీవ్ర నష్టం

➢ మొదటి పేజీ తరువాయి

ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు.భారత్‌లోని టెక్స్‌టైల్ రంగం 5 కోట్ల కుటుంబాలకు ఉపాధినిస్తోంది. నరేంద్ర మోదీ అమెరికాతో చేసుకున్న ఒప్పందం భారత టెక్స్‌టైల్ రంగాన్ని అంతం చేస్తుంది. ఈ విషయం నరేంద్ర మోదీకి, మొత్తం భారతదేశానికి తెలుసు. అదే నేను పార్లమెంటులో చెప్పాను. బంగ్లాదేశ్‌కు 0% పన్ను, భారత్‌కు 18% పన్ను విధిస్తున్నారు. అందువల్ల భారత టెక్స్‌టైల్ పరిశ్రమను బంగ్లాదేశ్ టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతీస్తుంది. మనకు కూడా ఆ రాయితీ కావాలంటే అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకోవాలని కేంద్రమంత్రి ఒకరు చెప్పారు. కానీ అసలు నిజం ఏమిటంటే మన పత్తి బంగ్లాదేశ్‌కు వెళ్తుంది. మన పత్తి ద్వారానే భారత్‌లో టెక్స్‌టైల్ మిల్లులు నడుస్తున్నాయి. ఒకవేళ మనం బంగ్లాదేశ్ లాగా అమెరికా పత్తిపై ఆధారపడితే మన దేశంలో పత్తి రైతులు, వస్త్ర పరిశ్రమ నాశనమైపోతాయి. ఒకవేళ మనం అమెరికా పత్తిని దిగుమతి చేసుకోకపోతే మన టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతింటుంది. ఇదే అసలు నిజం. పీయూష్ గోయల్ అబద్ధాలు చెప్పవద్దు. అందుకే 'సరెండర్' అంటున్నాను. ఎందుకంటే ఈ ఒప్పందం వల్ల పత్తి రైతు నష్టపోతాడని అన్నారు. ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్? గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ? ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్? గాంధీ విమర్శించారు.గత వారం భారత్?-అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో యూఎస్? పారిశ్రామిక వస్తువులు, విస్తృత శ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడం వంటివి ఆ ఒప్పందంలో ఉన్నాయి. వీటిలో పశుగ్రాసం కోసం ఎర్ర జొన్న, చెట్ల గింజలు, తాజా ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్, అదనపు ఉత్పత్తులు ఉన్నాయి. ప్రతిగా, యునైటెడ్ స్టేట్స్ వస్త్రాలు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు, సేంద్రీయ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు వంటి ఎంపిక చేసిన భారతీయ వస్తువులపై 18 శాతం సుంకాలను వర్తింపజేయనుంది. అయితే ఒప్పందం పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత, జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, వజ్రాలు, విమాన భాగాలు వంటి వస్తువులపై అమెరికా విధించిన సుంకాలు తొలగిపోనున్నాయి.

# రైతుభరోసా విడుదలకు రంగం సిద్ధం

➢ మొదటి పేజీ తరువాయి

అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా నిర్ణయం చేసినట్లు తెలుస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సిఎం రేవతం చర్చించే అవకాశం ఉంది. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు

తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

➢ మొదటి పేజీ తరువాయి

ఫలితాలపై మంత్రులను, కార్యకర్తలను అభినందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను మా ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి చూపించింది. మా సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకున్న నమ్మకమే ఈ విజయానికి పునాది' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రులందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ స్థాయిలో ఫలితాలు వచ్చాయని ఆయన కొనియాడారు. ఎన్నికల విజయం కేవలం ఆరంభం మాత్రమేనని, అసలైన అభివృద్ధి ఇప్పుడే మొదలవ్వాలని మంత్రులకు సీఎం సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు, మంత్రులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను, సంక్షేమ ఫలాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికలనూ ఎదుర్కోవాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఇదిలావుంటే సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తాజా పరిణామాలు, కొత్తగూడెం కార్పొరేషన్ గురించి చర్చించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ కూటమి (కాంగ్రెస్-22, సీపీఎం-1) 23 డివిజన్లలో విజయం సాధించింది. సీపీఐకి 22, బీఆర్ఎస్-8, భాజపా-1, స్వతంత్రులు 6 డివిజన్లలో గెలుపొందారు. స్వతంత్రుల్లో ఒకరు సీపీఐ నాయకుడు కావటంతో ఆ పార్టీ బలం కూడా 23కు చేరింది. మిగిలిన ఐదుగురు స్వతంత్రుల్లో ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారిలో ముగ్గురు హస్తం గూటికి చేరటంతో కాంగ్రెస్ కూటమి బలం 29కు పెరిగింది. అయితే భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఉత్కంఠ వీడింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి సమావేశం కావడంతో ఉత్కంఠకు తెరపడింది. కొత్తగూడెం కార్పొరేషన్ అంశంపై చర్చించిన నేతలిద్దరూ ఓ అంగీకారానికి వచ్చారు. మేయర్ పోస్ట్ సీపీఐకి, డిప్యూటీ మేయర్ పోస్ట్ కాంగ్రెస్ పార్టీకి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో కొత్తగూడెం కార్పొరేషన్ అంశం ఓ కొలిక్కి వచ్చింది. కాగా, ఈ కార్పొరేషన్‌లోని 60 డివిజన్లకు ఈనెల 11న ఎన్నికలు జరగ్గా.. 13న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆర్ఎస్ 8, సీపీఎం 1, బీజేపీ 1, స్వతంత్రులు 6 స్థానాల్లో జయకేతనం ఎగురవేశారు. మరోవైపు కొత్తగూడెం కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ 8 డివిజన్లను సొంతం చేసుకుంది. అయితే, వారంతా కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరిగింది. దీనిపై ఆ 8మంది కార్పొరేటర్లు స్పందించారు. మేయర్ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం చెప్పిందే తమకు శిరోధార్యమంటూ తేల్చి చెప్పారు. పార్టీ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు అమ్ముడు పోయారంటూ చేసే ప్రచారం అవాస్తమంటూ వీడియో విడుదల చేశారు.

# అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా పరుగులు

పద్దుల ప్రకటన కాదని.. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పం లాంటిదని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. వరుసగా మూడోసారి ఆయన బడ్జెట్‌ని ప్రవేశ పెట్టారు. ఒకసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్.. రెండు సార్లు పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన పయ్యావుల.. రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు, మూలధన వ్యయం రూ. 53,915 కోట్లగా అంచనా వేశారు. రెవెన్యూ లోటు రూ. 22,002 కోట్లు, ద్రవ్య లోటు రూ. 75,868 కోట్లగా అంచనా వేశారు. అయితే, రాష్ట్ర రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గింది అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. 2025- 26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 41, 118.36 కోట్లుకు చేరింది. 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 22, 002.50 కోట్లు ఉంది. 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రూ. 80,567.47 కోట్ల ద్రవ్య లోటుగా నమోదు అయింది. ఇక, 2026-27బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ. 75,868.09 కోట్లుగా ఉండొచ్చని అంచనా. 2026-27 వార్షిక బ్జడెట్: రూ.3,32,205 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం: రూ.2,56,143 కోట్లు,మూలధన వ్యయం: రూ.53,915 కోట్లు,రెవెన్యూ లోటు: రూ.22,002 కోట్లు,ద్రవ్య లోటు: రూ.75,868 కోట్లుగా చూపారు. ప్రధానంగా రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు, రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు, 'వీబీ జీ రామ్ జీ'కి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.5,451 కోట్లు, పరిశ్రమలకు రూ.3,161 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సర్దుబాటు నిధి రూ.1,500 కోట్లు, స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు, జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు కేటాయించారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు, పోలవరం రూ.6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు. సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు కేటాయింపులు పరిశీలిస్తే ...ఎన్టీఆర్ భరోసా - రూ.27,719 కోట్లు,దీపం 2.0 - రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతు - రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి - రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ - రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో - రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు

స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు,ఉపకార వేతనాలు రూ.3,836 కోట్లు ,సమగ్ర శిక్ష రూ.2,946 కోట్లుఉన్నత విద్య రూ.2,566 కోట్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం- రూ.2,161 కోట్లు ,మనబడి మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి కిరూ.1,232 కోట్లు,పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకు రూ.654 కోట్లు, యువత, క్రీడలు రూ.438 కోట్లుకేటాయించారు. శాఖల వారిగా బ్జడెట్ కేటాయింపులు పరిశీలిస్తే... వ్యవసాయ అనుబంధ రంగాలు - రూ.13,598 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ - రూ.22,942 కోట్లు, మున్సిపల్ శాఖ - రూ.14,539 కోట్లుజలవనరుల శాఖ - రూ.18, 224 కోట్లు, పాఠశాల విద్యాశాఖ - రూ.32,308 కోట్లు, ఇంధన శాఖ - రూ.13,934 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖ - రూ.11,118 కోట్లు, కార్మిక శాఖ - రూ.735 కోట్లు, గృహ నిర్మాణ శాఖ - రూ.6357 కోట్లు, రోడ్లు, భవన నిర్మాణాల శాఖ - రూ.9,856 కోట్లు, హోం శాఖ - రూ.9,165కోట్లు కేటాయించారు. ఇక ఇతర కేటాయింపులు పరిశీలిస్తే ..పోలీస్ శాఖకు 3 వేల కొత్త వాహనాలు కొత్త పోలీస్ అకాడమీ కోసం 94 ఎకరాలు,ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లు,జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు,స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు,విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ.28,000 కోట్లు,రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రూ.30,000 కోట్లు, కేటాయించారు. వరుసగా మూడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం తన అదృష్టమని అన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యానికి అనుగుణంగా బ్జడెట్ రూపొందించినట్లు తెలిపారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాయలసీమ రైతుల కలలను సాకారం చేసేది బడ్జెట్ అన్నారు. కుటుంబాన్ని నడిపిస్తున్న గృహిణికి భరోసా ఇచ్చేది బడ్జెట్ అని చెప్పుకొచ్చారు.

## అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యం

**కొనసాగుతున్న గాలింపు చర్యలు**

బెంగళూరు,ఫిబ్రవరి14 అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యమయ్యాడు. కర్ణాటకకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య (22) ఫిబ్రవరి 9 నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అతడి కోసం పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు.సాకేత్ బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. అతడు చివరిసారిగా క్యాంపస్‌కు కిలోమీటరు దూరంలో ఉన్న లేక్ అంజా సమీపంలో కన్పించినట్లు తెలుస్తోంది. అక్కడ అతడి పాస్‌పోర్టు, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాక్‌ప్యాక్‌లను అధికారులు గుర్తించారు. అతడిని గుర్తించేందుకు స్నేహితులతో కలిసి స్థానిక అధికారులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సాకేత్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నామని, వారికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. అమెరికా అధికారులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

## లాయర్ స్వప్న కేసులో నిందితుల అరెస్ట్

- హత్యకు ఉప యోగించిన కార్లు, ఫోన్లు స్వాధీనం
- భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసుల వెల్లడి

రంగారెడ్డి,ఫిబ్రవరి14 మొయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో న్యాయవాది స్వప్న హత్య కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ గోటికె స్వప్న ఫిబ్రవరి 4న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. న్యాయవాది స్వప్న హత్యకు భూ వివాదమే కారణమని నిర్ధారించారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులలో ప్రధాన నిందితుడు స్వప్న సొంత అన్న గోటికె రాజు మరో ముగ్గురు సహచరులతో కలిసి హత్యకు కుట్ర చేసినట్లు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ యోగేష్ గౌతమ్ చెప్పారు. సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై వివాదం. భూమి సర్వే కోసం వెళ్లిన సమయంలో నిందితులు స్వప్నపై దాడికి పాల్పడ్డారు. మొదటగా కారుతో ఢీకొట్టి, తర్వాత రాళ్లు,కర్రలతో దాడి చేసి అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేశారు. దీంతో ఘటన స్థలంలోనే స్వప్న మృతి చెందింది. హత్య అనంతరం ఇన్నోవా కార్, స్కూటీలో నిందితులు పరారయ్యారు. ఇన్నోవా కారు, స్కూటీ సీజ్ చేశారు. నలుగురు నిందితుల మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కొడవలిని కూడా సీజ్ చేశాం అని డీసీపీ యోగేష్ తెలిపారు.చెల్లిని చంపిన సొంత అన్న కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే స్వప్న అన్న రాజుతో పాటు ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్వప్న లొకేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ రెండు సార్లు స్వప్నను హత్య చేసేందుకు ప్రయత్నించినట్టు రాజు విచారణలో ఒప్పుకున్నాడు. ఒకసారి కారుతో మరోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీ కొట్టించే ప్రయత్నం చేశాడు రాజు. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్లాన్ చేశాడు. రెండు ఘటనల నుంచి స్వప్న తప్పించుకుంది. సీసీ కెమెరాలు లేని ప్రదేశాలు చూసి స్వప్నను వెనుక నుంచి ఢీ కొట్టేందుకు రాజు ప్లాన్ చేశాడు. ప్లాన్ సక్సెస్ చేసేందుకు తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. ఈ రోడ్డు ప్రమాదం కేసులను హత్యాయత్నం కేసులుగా పోలీసులు మార్చనున్నారు.

## ప్రదోష కాలమే పరమశివుడికి ప్రీతికరం

- ఆ సమయంలోనే పూజలు చేస్తే మంచిది

వేములవాడ,ఫిబ్రవరి14 తిథులలో త్రయోదశి, చతుర్దశి చాలా ప్రత్యేకమైనవి. శివరాత్రికి సంబంధించినంత వరకు 'ప్రదోష' కాలం చాలా ముఖ్యం. అంటే రాత్రి కాలం అని అర్థం. రాత్రి వేళ ప్రదోషంతో ప్రారంభమవుతుంది. అంటే... సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల మధ్య సమయం అన్నమాట. ఈ సమయంలో పరమేశ్వరుడిని పూజించినా, శివ పంచాక్షరీ ధ్యానం చేసినా మానసిక ప్రశాంతత లభిస్తుంది. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఇక, త్రయోదశికి మన్మథుడు, చతుర్దశికి కలి పురుషుడు అధిపతులు. వీరిరువురినీ నియంత్రించే శక్తి ఒక్క పరమేశ్వరుడికే ఉంది. అలాగే బుధ, గురువారాలు బుద్ధికీ, మాటకీ సంకేతం గనక... రోజూ కాకపోయినా ఈ రోజుల్లో, ఆ తిథుల్లో ప్రదోషకాలంలో శివారాధన చేయాలని చెబుతారు. 'ఓం నమః శివాయ' అని స్మరిస్తే చాలు కరిగిపోతాడు పరమశివుడు. భక్తితో ఓ సుమం సమర్పించినా సంతుష్టుడవుతారు. ఇక స్వామికెంతో ప్రీతి కరమైన ప్రదోష కాలంలో పూజిస్తే విశేష ఫలితాలు ఉంటాయి. ప్రదోషమంటే పాప నిర్మూలన. తెలిసీ తెలీక చేసే పాపకర్మల వల్ల ప్రతిబంధకాలను కొని తెచ్చుకున్నట్లవుతుంది. దాంతో పురోభివృద్ధికి ఉన్న అవకాశాలు పరిమితమౌతాయి. ఆ పాపకర్మలు నిర్జీవం కావాలంటే, దానికి తగ్గ పుణ్యకర్మలు చేయాలి. పరమశివుడు ప్రమథ గణాలతో కొలువయ్యుండే ప్రదోషకాలంలో శివుని స్మరిస్తే మన పాప కర్మల ఫలాన్ని తాను స్వీకరించి కష్టాలను తొలగిస్తాడనేది భక్తుల నమ్మకం. అందుకే ఉపవాసంత తరావత ప్రదోష కాలంలో అభిషేకాలు చేయాలి.

## రాయలసీమ ముఖచిత్రం మార్చింది తామే

- సీమ హార్టికల్చర్ హబ్‌కు 30వేల కోట్లు కేటాయింపు
- అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీగా అబివృద్ధి
- మీడియాతో చంద్రబాబు వెల్లడి

అమరావతి,ఫిబ్రవరి14:రాయలసీమ ముఖచిత్రం మార్చింది తామేనని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు 30వేల కోట్లు కేటాయించడం పట్ల ఎమ్మెల్యేలంతా సంతోషంగా ఉన్నారని సీఎం అన్నారు. సీఎం చంద్రబాబు అసెంబ్లీ లాబీలో మీడియాతో మాటామంతీ జరిపారు. ఈ సందర్భంగా అమరావతి అభివృద్ధిపైనా, ప్రకాశం, రాయలసీమ అభివృద్ధి మీద కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం ఇంకా వైసీపీ పాలనలో వచ్చిన విధ్వంసం నుంచి పూర్తిగా కోలుకోవడానికి సమయం పడుతుందన్న చంద్రబాబు.. ప్రస్తుత బడ్జెట్ మెరుగైనది అయినప్పటికీ సమస్యలు ఎన్నో ఉన్నాయని అన్నారు. అమరావతి విషయంలో చంద్రబాబు మాట్లాడుతూ, రెండు, మూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుందని, రాజధానిని జాతీయ రహదారులకు అనుసంధానిస్తున్నామని చెప్పారు. దీంతో రాకపోకలు పెరిగి ఆదాయం వస్తుందని వివరించారు. రాజధాని అమరావతికి పశ్చిమ బైపాస్ వల్ల యాక్సెస్ పెరిగిందని, ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌లతో మరింత యాక్సెస్ మెరుగుపడుతుందని సీఎం పేర్కొన్నారు. 'ఇది అమరావతిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఉంటుంది. ఇది కేవలం రాజధాని నగర అభివృద్ధి మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కీలకం'. అని చంద్రబాబు చెప్పారు. కూటమి ప్రభుత్వం అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా తీర్చిదిద్దుతోందని సీఎం తెలిపారు. ఇటీవల క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన చేసి, అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా మార్చాలనే లక్ష్యం ప్రకటించామని.. ఇది హైదరాబాద్ ఐటీ రివల్యూషన్‌తో పోల్చదగిన మరో విప్లవం అవుతుందని ఆయన అన్నారు. ప్రపంచంలో టాప్-3 క్వాంటం వ్యాలీల్లో అమరావతి ఒకటిగా నిలవాలనేది మన దీర్ఘకాలిక దృష్టి అని చంద్రబాబు తెలిపారు. అదే సమయంలో, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరకని రాయలసీమలో ఇప్పుడు దేశంలోనే ఉత్తమ పండ్లు ముఖ్యంగా దానిమ్మ పండుతున్నాయని, అప్పుడు తెచ్చిన హంద్రీ-నీవా ప్రాజెక్టు ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని చెప్పారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు.. 500 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు.

# తొలిదశ పార్లమెంట్ సమావేశాలు ముగింపు



హైదరాబాద్,ఫిబ్రవరి14 పార్లమెంట్ బడ్జెట్ తొలిదశ సమావేశాలు ముగిసాయి. యధావిధిగా రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ ప్రసంగం, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం వంటివన్నీ యథాలాపంగా ముగించేశారు. నానాటికి తీసికట్టు నాగంబొట్లు అన్నట్లుగా..ఈ సమావేశాలను కూడా మొక్కుబడిగానే ముగించేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో పెద్దగా మెరుపేలమీ లేవు. ప్రభుత్వం చెబుతన్నదే చర్విత‌చరణంగా చెబుతున్నారు. ఇకపోతే స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం ఒకటి ఈ సమావేశాల్లో ప్రధాన అంశంగా మారింది. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన ప్రతిపక్షం ఆరోపణగా ఉంది. స్పీకర్, ప్రబుత్వానికి సంబంధించినంత వరకు ఇదో మరక లాంటిదే. చరిత్రలో ఫలానా స్పీకర్ తీరుపై అవిశ్వాసం పెట్టారని గుర్తుండిపోతుంది.నిజానికి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఎంతో ముఖ్యమైనవి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలోనే అనేక విషయాలు ప్రస్తావనకు వస్తాయి. పాలకపక్షాన్ని విపక్షాలు నిలదీస్తాయి. విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. అలాగే అవకాశం వచ్చేలా విపక్షం కూడా వ్యవహరించడం లేదు. చర్చ జరిగితే ప్రజల సమస్యలు దేశానికి తెలిసేవి. కానీ మొక్కుబడి సమావేశాలు సాగుతున్న తీరు దురదృష్టకరం. రాష్ట్రపతి ప్రసంగంపై రాజ్యసభలోనే ప్రధాని సమాదానం చెప్పి సరిపుచ్చారు. మోడీ అధికారంలోకి వచ్చాక విపక్షాల సమస్యలను ఆకళింపు చేసుకోవడమో లేదా, వారినుంచి చర్చను ఆహ్వానించడమో జరగడం లేదు. అర్థవంతమైన చర్చలను చూసి పార్లమెంట్ ఎన్నో ఏళ్లు గడిచి పోతున్నాయి. పార్లమెంటుకు ప్రధాని సమాధానం ఇవ్వకపోవడం చాలా బాధాకరం. ప్రతిపక్ష నేతగా రాహుల్ ప్రసంగానికి కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఇకపోతే విపక్షనేతను పార్లమెంట్‌కు అనర్హుడిని చేయాలని బిజెపి సభ్యుడు కూడా ప్రతిపాదించడం కేవలం కక్షసాధింపు చర్యగానే చూడాలి. తమ తప్పుల్ని కప్పి పుచ్చుకోవడానికి, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి పాలకపక్షం చేస్తున్న ప్రయత్నాలు ఎంతోకాలం సాగవని గుర్తించాలి. అమెరికాతో ఒప్పందం కావచ్చు, యూరోపియన్ యూనియన్‌తో ఒప్పందం కావచ్చు..పార్లమెంటు చర్చించాల్సి ఉంది. ప్రభుత్వ తీసుకుంటున్న నిర్ణయాలపై చర్చ సాగాలి. కానీ అలా సాగడం లేదు. అధికార పార్టీ నేతలు అడుగడుగునా రాహుల్ గాంధీ నిలదీసి ప్రశ్నిస్తున్నారు. దానిబదులు అతను ఏం చెబుతాడో తెలుసుకుంటే బాగుండేది. రాహుల్ గాంధీ ఇస్తున్న వాయిదా తీర్మానాలు ఎలాగూ చర్చకు రావడం లేదు. కనీసం మరో విధంగా చర్చకు తీసుకునే అవకాశం గురించి రాహుల్ ఆలోచించడం లేదు. ఒకవేళ సమస్యలపై సిరయస్‌గానే చర్చ జరగాల్సి ఉంటే అందుకు అనేక రకాల మార్గాలు ఉన్నాయి. రూల్స్ పొజిషన్ ఉంది. అలా చర్చను కోరే అవకాశం సులువు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం పేర నడుస్తున్న ప్రహసనంలో ఏం జరిగిందో దేశ ప్రజలకు తెలియాలి. అమెరికా మధ్యంతర ఒప్పందం కారణంగా దాని ప్రభావం మనదేశ రైతాంగంపై పడుతుందన్న భావన ఉంది. అలాంటిదేమీ లేదని పాలకవర్గం చెబుతోంది. అవే విషయం పార్లమెంట్ వేదికగా చెప్పివుంటే బాగుండేది. దేశ ఉత్పత్తులపై సుంకాన్ని జీరో శాతానికి తేవడం అంటే.. ఇక్కడి చిన్న, సన్నకారు వ్యవసాయదారుల్ని, వ్యాపారుల్ని రోడ్డున పడేయడమేనని అంటున్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలకు పార్లమెంట్ చర్చల ద్వారా పరిష్కారం చూపాల్సి ఉంది. అమెరికాతో వాణిజ్య ఒప్పంద నిర్ణయం చిన్నవిషయం కాదు. ఇది కేవలం మోడీకి సంబంధించినది అస్సలే కాదు. పార్లమెంటును విశ్వాసం తీసుకోవాల్సింది. కీలకమైన విషయాల్లో ఈ దేశ పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోవడం అవసరం. కానీ అలా జరగడంలేదు. వాణిజ్య ఒప్పందం కోసం రష్యాతో చమురు కొనుగోళ్లు తగ్గించినా అమెరికా మనల్ని పాకిస్తాన్‌తో సమానంగా చూడడం దురదృష్టకరం. ఇప్పుడు ప్రధానిగా ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మోడీపై ఉంది. అనేక సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌కు అవకాశం కల్పించాలి. ప్రజల అనుమానాలు నివృత్తి చేయాలి. దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నట్లు వస్తున్న ఆరోపణలకు సవివరమైన సమాధానం రావాల్సి ఉంది. అప్పుడే పార్లమెంట్‌కు విలువ ఉంటుంది. ఇందుకు తాము అనుగుణంగా ఉన్నామా లేమా అన్నది ఇరుపక్షాలు బేరీజు వేసుకోవాల్సి సమయం కూడా.

# శివరాత్రి రుద్రుడికి ప్రీతకరం

**ఉపవాసంతో స్వామికి అర్చన మంచిది**




ద్రాక్షారామం,ఫిబ్రవరి14 శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహా శివరాత్రి. హిందువులు పెద్ద పండుగల్లో శివరాత్రి ఒకటి. పార్వతీదేవిని శివుడు పెళ్లాడిన రోజునే ఈ పండుగగా జరుపుకుంటారు. అలాగే శివపురాణంలో మహాశివరాత్రికి సంబంధించి ఇంకొన్ని కథలు కూడా ఉన్నాయి. మాఘమాసంలోని కృష్ణ పక్ష చతుర్దశి రోజున మహా శివరాత్రి వస్తుంది. ఈ రోజున శివుడిని భక్తి, పూజలతో కొలిస్తే అంతా మంచి జరుగుతుందని నమ్ముతారు. ఈ ఏడాది అలాంటి పవిత్రమైన రోజు ఫిబ్రవరి 15న వచ్చింది. దేశమంతటా శివాలయాల్లో పెద్ద ఎత్తున శివరాత్రి సంబరాలు జరుగుతుంటాయి. శివరాత్రి అనగానే అందరికీ వెంటనే గుర్తొచ్చేది. ఉపవాసం, జాగరణ. ఈ రోజున ఉపవాసం ఉండి, రాత్రి జాగరణ చేస్తే పుణ్యం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు.శివరాత్రి నాడు తెల్లవారుజామునే లేచి, స్నానం చేసి ఆ తర్వాత శివరాత్రి వ్రతాన్ని మొదలుపెట్టాలి. ఈ వ్రతం చేసేటప్పుడు ఉపవాసం, జాగరణం, బ్రహ్మచర్యం అనే నియమాలు పాటించాలి. ఇంట్లోనే గానీ, ఆలయంలోగానీ వ్రతాన్ని ఆచరించవచ్చు. రాత్రంతా జాగరణం ఉండి, ఉదయాన్నే స్నానం చేశాక మళ్లీ పూజ చేసి వ్రతాన్ని విడవాలి. అన్నం లాంటి రోజూ తీసుకునే ప్రధాన ఆహారం కాకుండా పాలు, పండ్లు మాత్రమే, అదీ సాయంత్రం పూటనే తీసుకోవాలి. ఇతరులతో దైవ సంబంధమైన మాటలనే ఎక్కువగా మాట్లాడితే మంచిది. ఓం నమః శివాయ మంత్రాన్ని జపిస్తూ ఉండాలి.

అనారోగ్యంతో ఉన్నప్పుడు ఉపవాసం ఉండకండి.మహా శివరాత్రి నాడు భక్తులు ఉపవాస దీక్షను పాటిస్తారు. చాలామంది కఠినంగా ఉండి.. కనీసం నీరు కూడా తాగరు. దీనిని నిర్జల ఉపవాసం అంటారు. కొంతమంది పాలు పండ్లు లాంటి సాత్విక ఆహారం తీసుకుంటారు. ప్రస్తుతం జీవన ప్రమాణాల దృష్ట్యా పెరుగు, మజ్జిగ, కొబ్బరి నీరు డ్రై ఫ్రూట్స్ వంటివి కూడా తినవచ్చు. శివరాత్రి మరుసటి రోజు సూర్యోదయం అయిన తరువాత ఉపవాస దీక్షను విరమించాలి. మహాశివరాత్రి ఉపవాస సమయంలో కొన్ని ఆహారాలను ఖచ్చితంగా తినకూడదు. వీటిలో గోధుమలు, బియ్యం, పప్పులు మరియు పప్పుధాన్యాలు వంటి ధాన్యాలు ఉన్నాయి. ఉల్లిపాయలు, వెల్లుల్లి , ఉడికిన పదార్థాలను తినకూడదు. ఇంకా వీటితో పాటుగా మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలని పండితులు చెబుతున్నారు. శివరాత్రికి చేసే జాగరణ మనలో ఉన్న శివత్వాన్ని జాగృతం చేస్తుంది. జాగరణం మనలో ఉన్న శివుడిని జాగృతం చేస్తుంది, తమస్సును తొలగిస్తుంది. సినిమాలు చూస్తునో, పిచ్చి కబుర్లు చెప్పుకుంటూనో, కాలక్షేపం చేస్తూనో చేసే జాగరణకు అది జాగరణ అవ్వదు, కాలక్షేపం మాత్రమే అవుతుంది. అప్పుడు పుణ్యం రాకపోగా, ఆ సమయంలో మట్లాడిన చెడు మాటల వలన పాపం వస్తుంది. శివరాత్రి మరునాడు ఉదయం శివాలయాన్నిసందర్శించి, ప్రసాదం తీసుకుని, ఇంటికి వచ్చి భోజనం చేసి ఉపవాస వ్రతం ముగించాలి. అందరూ గుర్తుపెట్టుకోవలసిన ముఖ్య విషయం, శివరాత్రి నాడు ఉపవాసం, జాగరణ చేసినవారు, తరువాత రోజు రాత్రి వరకు నిద్రించకూడదు. అప్పుడే సంపూర్ణఫలం దక్కుతుందని చెప్తారు.

# శ్రీశైలంలో వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

**పుష్పపల్లకిపై దర్శనమిచ్చిన మల్లికార్జునుడు**



శ్రీశైలం,ఫిబ్రవరి14 శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వైభవంగా జరుగుతున్నాయి. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి అమ్మవారు పుష్పపల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పపల్లకిలో శ్రీస్వామి అమ్మవారికి అర్చకులు వేదపండితులు ఆలయ చైర్మన్, సభ్యులు,ఈవో శ్రీనివాసరావు ప్రత్యేకపూజలు నిర్వహించి హారతులిచ్చారు. విద్యుత్ దీపకాంతుల నడుమ శ్రీశైలం పురవీధులలో శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్సవానికి తరలుతుండగా... ఉత్సవం ముందు కోలాటాలు డమరక నాధాలతో పలు రకాల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం ఎదుట పలు రకాల పుష్పాలతో దేదీప్యమానంగా సర్వాంగ సుందరంగా తయారుచేసిన పుష్పపల్లకిలో శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్సవంలో భక్తులను కనువిందు చేశారు గంగాధర మండపం దగ్గర పుష్పపల్లకిలో ఉన్న శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక హారతులిచ్చి అనంతరం అంకాలమ్మ గుడి,నంది మండపం బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవం కన్నులపండువగా సాగింది. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు పుష్పపల్లకిపై ఉన్న శ్రీస్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలర్పించారు.

# పాలమూరు కార్పొరేషన్‌పై పీఠముడి

- క్యాంప్ రాజకీయాలకు తెరలేపిన కాంగ్రెస్
- చైర్మన్ పదవులకు పాత, కొత్త అధికార పార్టీ నేతల కీచులాట
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో రసవత్తరంగా రాజకీయం
- మున్సిపాలిటీల్లో టెన్షన్.. టెన్షన్..
- గద్వాలలో హస్తం పార్టీ అరాచకం




మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఒకవైపు అధికారం, మరోవైపు పోలీస్ యంత్రాంగం సహకారం ఇంకోవైపు ఎన్నికల అధికారుల అండదండలతో తాము అనుకున్నది సాధించారు. అయినా మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో మెజార్టీకి దూరంగా నిలిచిపోయారు. ఎక్కడ మేయర్ పదవి చేజారుతుందో అన్న భయంతో రాత్రికి రాత్రి క్యాంప్ రాజకీయాలకు తెరలేపారు. అర్ధరాత్రి గెలిచిన కార్పొరేటర్లను క్యాంప్ ఆఫీసుకు పిలిపించి బస్సుల్లో ఆంధ్రాకు తరలించారు.తెలంగాణ వార్తలుసీఎం సొంత జిల్లాలో అధికారం ఎక్కడ చేజారుతుందోనని భయంతో క్యాంప్ రాజకీయాలకు తెరలేపడం ఒక ఎత్తు అయితే ఆంధ్రాకు తీసుకెళ్లి క్యాంప్ పెడితే సేఫ్ అని ఏకంగా చీరాలకు తరలించారు. ఇక మిగతా మున్సిపాలిటీ లో అధికారం కైవసం చేసుకున్నా పాత, కొత్త కాంగ్రెస్ నేతల మధ్య పదవుల పంపకంపై పేచి మొదలైంది. ఇక గద్వాలలో అరాచకీయమే రాజ్యమేలింది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యే చేసిన పనికి ఎన్నికల అధికారులు సైతం వత్తాసు పలకడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు బీజేపీ ఒక్క అడుగు దూరంలో నిలిచింది. అయితే ఇండిపెండెంట్‌లను ప్రలోభ పెట్టి పార్టీలో చేర్చుకొని పీఠం ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో ఫార్వర్డ్ బ్లాక్ తరపున పోటీచేసి గెలిచిన అభ్యర్థులకు అధికార పార్టీ ప్రలోభపెట్టి భారీ ఆఫర్ ఇచ్చి ఏకంగా సీఎం దగ్గరికి తీసుకెళ్లి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు.ఆ జిల్లాలో ఖాతా తెరిచేందుకు పెద్దఎత్తున ప్రలోభాలకు గురిచేసినట్లు విమర్శలు వస్తున్నాయి. ఇంత చేసినా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు వచ్చి న ఓటింగ్ శాతం చూసి అధికార పార్టీ కంగుతిన్నది. అధికార పార్టీతో పోలిస్తే బీఆర్‌ఎస్‌కు కేవలం 10శాతం మాత్రమే వ్యత్యాసం ఉంది. వార్డు స్థానాల్లో కూడా గులాబీ పార్టీ ప్రభంజనం సృష్టించింది. సీఎం సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు గెలిచిన ఆనందంలో పైశాచికత్వం ప్రదర్శిస్తూ అర్ధరాత్రి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఇంటికెళ్లి దాడికి దిగారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన మున్సిపల్ ఎన్నికలు.. ఇప్పుడు రణరంగాన్ని తలపించాయి. అడుగడుగునా నిబంధనలు తుంగలోకి తొక్కి అధికారం కైవసం చేసుకున్నారు.

### ఓటమిని జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్‌పై దాడులు

మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక చాలాచోట్ల బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి మున్సిపాలిటీలో విపక్షాలను బెదిరించి భయపెట్టి ఏకపక్షంగా ఓట్లు వేసుకున్నా అధికార పార్టీ నాయకులు అర్ధరాత్రి ఒకటో వార్డు బీఆర్‌ఎస్ అభ్యర్థి రాజశేఖర్ దంపతులపై దాడికి తెగబడ్డారు. ఎక్కడ ఓట్లు వేయకపోతే ఏమవుతుందోనని ప్రజలు కూడా భయపడాల్సిన పరిస్థితిని తీసుకొచ్చారు. మహబూబ్‌నగర్‌లో కూడా ఆయా డివిజన్‌లో హోరాహోరీ పోరు నడిచింది. అయితే బీఆర్‌ఎస్ గెలవడంతో ఓటమిని తట్టుకోలేక భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారికి గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు. మిగతా మున్సిపాలిటీలో కూడా కాంగ్రెస్ ఓటమి పాలు కావడంతో అక్కడక్కడ బెదిరింపులకు దిగారు. ఇక గద్వాలలో విపక్షాలు లేకుండా చేస్తామని ఫిరాయింపు ఎమ్మెల్యే అనుచరులు బాహాటంగా ప్రకటిస్తున్నారు.

### క్యాంపునకు తరలిన కార్పొరేటర్లు

మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మ్యాజిక్ ఫిగర్‌కు మూడు సీట్లు దూరంగా ఉన్న అధికార పార్టీ హడావుడిగా అర్ధరాత్రి కార్పొరేటర్లను క్యాంప్‌నకు తరలించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు బస్సుల్లో 28 మంది కార్పొరేటర్లను, కొందరు స్వతంత్ర కార్పొరేటర్లను తీసుకువెళ్లినట్లు సమాచారం. వీరందరిని తన రాజకీయ గురువు చంద్రబాబు పర్యవేక్షణ ఉంటుందని.. ఆంధ్రాకు పంపించారు. వీరందరిని ఒంగోలు జిల్లా చీరాల రిసార్ట్‌లో ఉంచినట్లు సమాచారం . వీరంతా మందు, విందులతో చిందులు వేస్తున్నారు.ఇదిలా ఉండగా డిప్యూటీ మేయర్ పదవిపై తీవ్ర పోటీ రావడంతో కొంతమంది కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీకి ఇవ్వాలని కొంతమంది.. పాత కాంగ్రెస్ నేతలకు ఇవ్వాలని మరికొంతమంది.. పట్టుబడుతున్నారు. అయితే మహబూబ్‌నగర్ జిల్లాలో 40ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు చేసిన బెనహర్ కూతురికీ డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తుంది. మరో ఆరుగురు డిప్యూటీ మేయర్ కోసం పోటీపడుతున్నారు. అసంతృప్తి తీవ్రస్థాయిలో పెరుగుతోందని సమాచారం. ఒకవేళ అదే జరిగితే మేయర్‌ను ఎన్నుకొని డిప్యూటీ మేయర్‌ను వాయిదా వేసేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.

### సత్తా చాటిన మాజీ మంత్రి

మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఒంటరి పోరాటం ఫలించింది. హోరాహోరీ పో రులో 16డివిజన్లను గెలుచుకున్నారు. నాలుగుస్థానాలు 25 ఓట్ల తేడాతో కోల్పోయారు. మరో మూడు స్థానాలు 100లోపు ఓట్ల తేడా తో ఓటమి పాలయ్యారు. ఈ సీట్లే గనక వస్తే కార్పొరేషన్‌లో బీఆర్‌ఎస్ కీలకంగా మారేది. ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తామని ప్రతిపక్ష పాత్రలు హుందాతనంగా పోషిస్తామని ప్రకటించారు. అంతేకాకుండా బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన పెండింగ్ పనులను పూర్తిచేసేలా ఒత్తిడి చేస్తామని.. కా ర్పొరేషన్ అభివృద్ధి చేసేందుకు పార్టీ తరఫున ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఇక మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చక్రం తిప్పారు. అమరచింతలో హంగ్ రావడంతో మ్యాజిక్ ఫిగర్‌కు అవసరమైన మెజార్టీని సాధించి బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తున్నారు. మొత్తంపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండేళ్లలో అధికార పార్టీకి తీవ్ర వ్యతిరేకత ఉత్పన్నం కావడం.. ప్రజలు కారుకే జై కొట్టడం చూస్తుంటే రాబోయే ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల్లో కూడా ఇదే విధమైన ఫలితాలు రాబోతున్నాయి అన్న సంకేతాలు వినిపిస్తున్నాయి.

## ఐఎస్‌ఎస్‌కు నలుగురు వ్యోమగాముల పయనం



కేప్ కెనావెరాల్, ఫిబ్రవరి 14:
వైద్యపరమైన అత్యవసర కారణాల వల్ల నలుగురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్) నుంచి అర్ధాంతరంగా భూమికి తిరిగొచ్చిన నేపథ్యంలో వారి స్థానాన్ని భర్తీ చేయడానికి తాజాగా మరో బృందం రోదసిలోకి పయనమైంది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన రాకెట్ ద్వారా వారు రోదసిలోకి బయల్దేరారు.

## బీఆర్‌ఎస్ మహిళా అభ్యర్థిపై దాడి.. తాగిన మైకంలో అర్ధరాత్రి రెచ్చిపోయిన కాంగ్రెస్ నేతలు

- సీఎం రేవంత్ ఇలాకా కోస్గి పట్టణంలో రౌడీ మాఫియా



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్‌ఎస్ మహిళా అభ్యర్థిపై కాంగ్రెస్ మూకలు దాడికి తెగబడిన ఘటన నారాయణపేట జిల్లాలో కోస్గి లో చోటుచేసుకున్నది. సీఎం ఇలాకాలోని కోస్గిలో శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పూర్తయి ఫలితాలు ప్రకటించిన తర్వాత కాంగ్రెస్ రౌడీ మూకలు రెచ్చిపోయాయి. అర్ధరాత్రి సమయంలో 2వ వార్డు అభ్యర్థి అలవేణి రాజశేఖర్ ఇంటిపై దాడికి తెగబడ్డారు. గెలిచిన ఆనందంలో పైశాచికత్వంగా ప్రవర్తించారు.విచక్షణ లేకుండా.. మహిళ అని కూడా చూడకుండా.. ఆమెతోపాటు తన భర్తపై దాడికి దిగారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో కిడ్నాప్‌లు, బెదిరింపులు సర్వసాధారణంగా మారాయని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్తున్నారు.

## ఛత్తీస్‌గఢ్: డ్యాన్సులతో ఊరేగింపుగా వెళ్తున్న పెళ్లి బృందం.. వారిపైకి దూసుకెళ్లిన లారీ



రాయ్‌పూర్: ఒక పెళ్లి బృందం డ్యాన్సులతో ఊరేగింపుగా పెళ్లి వేదిక వద్దకు వెళ్తున్నది. ఇంతలో ఒక లారీ వారిపైకి దూసుకొచ్చింది. మహిళలతో సహా పలువురు గాయపడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. (ౖతీబఏని =బఅం ౪ాజవతీ ఋఅఏఱఅస్త్ర ×అ దీఋతీఋఫ్) ఛత్తీస్‌గఢ్‌లోని జాంజ్‌గిర్-చంపా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక పెళ్లి బృందంలోని మహిళలు, పురుషులు డీజే పాటలకు అనుగుణంగా డ్యాన్స్ చేస్తున్నారు. ఎంతో సంతోషంగా పెళ్లి వేదిక వద్దకు ఊరేగింపుగా బయలుదేరారు.కాగా, ఉన్నట్టుండి పెళ్లి బృందంపైకి ఒక లారీ దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఒక వ్యక్తికి వెన్నెముక విరిగింది. ఇద్దరు మహిళలకు కాళ్ళు, ఛాతికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పెళ్లి బృందంపైకి లారీ దూసుకెళ్లిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## మునుగోడులో ఆరోగ్య లక్ష్మీ కమిటీ ఏర్పాటు



మునుగోడు, ఫిబ్రవరి 13 :
పౌష్టికాహారం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామ పంచాయతీల సర్పంచులకు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచ్ పాలకూరి రమాదేవి చైర్మన్‌గా 11 మంది సభ్యులతో కలిసి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకులు నాణ్యమైనవి అందజేయాలని, బాలింతలకు సరైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మున్సిపల్ పీఠం బీఆర్‌ఎస్‌దే.. ఎందుకంటే..?




నర్సాపూర్, ఫిబ్రవరి13:
నర్సాపూర్ చైర్మన్ పీఠం బీఆర్‌ఎస్ పార్టీకే దక్కే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. మున్సిపల్ ఓట్ల లెక్కింపులో ఏ పార్టీకి సంపూర్ణమైన మెజార్టీ రాకపోవడమే అందుకు కారణం. మొత్తం 15 వార్డులకు ఎన్నికలు జరుగగా.. బీఆర్‌ఎస్ పార్టీ 5, కాంగ్రెస్ పార్టీ 6, బీజేపీ 4 వార్డ్స్‌ల్లో విజయం సాధించాయి. దాంతో.. చైర్మన్ పీఠంపై ఉత్కంఠ నెలకొంది.ఏ పార్టీకి సంపూర్ణమైన మెజార్టీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలంటే కనీసం 8 మంది కౌన్సిలర్ల కోరం కావాలి. ఈ పరిస్థితుల్లో ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకంగా మారనున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీకి ఒక ఎమ్మెల్యే, ఇద్దరు ఎమ్మెల్సీలు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. దీంతో.. కోరం ప్రకారం 8 మంది మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకి ఉండడంతో చైర్మన్ పీఠందక్కించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# గుమ్మడి గింజలను రోజూ తింటే అసలు ఎలాంటి లాభాలు కలుగుతాయి కచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయాలు



మన ఆరోగ్యానికి మేలు చేసే శక్తివంతమైన గింజల్లో గుమ్మడి గింజలు కూడా ఒకటి. ఇవి చిన్నగా ఉన్నప్పటికీ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పవచ్చు. వీటితో మొక్కల ఆధారిత ప్రోటీన్ తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, మెగ్నీషియం, జింక్, ఫాస్పరస్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. వీటిని పచ్చిగా, కాల్చుకుని లేదా స్మూతీ, సలాడ్ వంటి వాటితో కలిపి తీసుకోవచ్చు. గుమ్మడి గింజలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి అనేక శారీరక విధుల్లో కీలక పాత్ర పోషిస్తాయి. అసలు ఈ గుమ్మడి గింజలను రోజు వారీ ఆహరంలో భాగంగా ఎందుకు తీసుకోవాలో.. ఇప్పుడు తెలుసుకుందాం.

## గుండె ఆరోగ్యానికి

గుమ్మడి గింజల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. వీటిలో మంచి కొలెస్ట్రాల్ ను, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఇతర పోషకాలు కూడా ఉంటాయి. ఈ గింజలను ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల లిపిడ్ ప్రొఫైల్స్ పై సానుకూల ప్రభావాలను చూపిస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అలాగే గుమ్మడి గింజలను భోజనంలో తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారిలో గ్లైసెమిక్ నియంత్రణ మెరుగుపడుతుందని అధ్యయనాల ద్వారా నిరూపించారు. వీటిలో ఉండే ఫైబర్, ప్రోటీన్ జీర్ణక్రియను నెమ్మదింపజేయడంతో పాటు గ్లూకోజ్ శోషణను నెమ్మదిస్తుంది. భోజనం తరువాత రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. అంతేకాకుండా గుమ్మడి గింజల్లో ఉండే బయోయాక్టివ్ సమ్మేళనాలు ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో సహాయపడతాయని వైద్యులు చెబుతున్నారు.

## నిద్రలేమికి

ఇక గుమ్మడి గింజల్లో మెగ్నీషియం, ట్రిప్టోఫాన్ ఉంటాయి. ఇవి రెండూ కూడా ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తాయి. గుమ్మడి గింజలను తీసుకోవడం వల్ల నిద్ర నాణ్యత, వ్యవధి కూడా పెరుగుతుంది. నిద్రలేమి సమస్యతో బాధపడే వారు రోజూ గుప్పెడు గుమ్మడి గింజలను తీసుకోవడం వల్ల నిద్రలేమి సమస్యలు తగ్గి మంచి నిద్రను సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా గుమ్మడి గింజల్లో జింక్ సమృద్ధిగా ఉంటుంది. శరీరంలో హార్మోన్ల ఉత్పత్తికి, నియంత్రణలకు జింక్ చాలా అవసరం. పురుషుల్లో టెస్టోస్టిరాన్ సంశ్లేషణ, మహిళల్లో మొత్తం హార్మోన్ల సమతుల్యతలో, పునరుత్పత్తి ఆరోగ్యంలో జింక్ కీలక పాత్ర పోషిస్తుంది.

## పురుషుల ఆరోగ్యానికి

గుమ్మడి గింజలను తీసుకోవడం వల్ల సంతానోత్పత్తికి మద్దతు లభిస్తుంది. శరీర జీవక్రియతో పాటు శరీర రోగనిరోధక శక్తి కూడా మెరుగుపడుతుంది. గుమ్మడి గింజల్లో మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి తగినంత శక్తి లభిస్తుంది. ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీర్ణక్రియ, హృదయ ఆరోగ్యంతో పాటు వివిధ శారీరక విధులు మెరుగుపడతాయి. వీటిని తీసుకోవడం వల్ల పోషకాహార లోపాల నుండి బయటపడవచ్చు. ముఖ్యంగా మొక్క ఆధారిత ప్రోటీన్ తీసుకోవాలనుకునే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పవచ్చు. ఇలా అనేక రకాలుగా మన మొత్తం శరీర ఆరోగ్యానికి ఇవి మేలు చేస్తాయి కనుక వీటిని తప్పకుండా ఆహారంలో భాగంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు ఆహారంలో విషయంలో ఈ మార్పులు తప్పక చేయాలి

మన జీవన విధానంలో, ఆహారంలో వచ్చిన మార్పులు మనల్ని అనేక అనారోగ్య సమస్యల బారిన పడేలా చేస్తున్నాయి. వాటిలో ఫ్యాటీ లివర్ సమస్య కూడా ఒకటి. ఈ సమస్య ఇప్పుడు సాధారణ సమస్యలాగా మారింది. ఫ్యాటీ లివర్ లో రెండు రకాలు ఉన్నాయి. ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్. ఆల్కహాల్ తక్కువ తాగే వారిలో లేదా అసలు తాగని వారిలో కూడా మారిన ఆహారపు అలవాట్ల కారణంగా ఈ సమస్య తలెత్తుతుంది. ఫ్యాటీ లివర్ సమస్యను ముందుగా గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం చాలా అవసరం. ఈ సమస్యను కనుక నిర్లక్ష్యం చేస్తే ఇది కాస్తా నాన్ ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్, సిర్రోసిస్ తో పాటు చివరగా కాలేయ క్యాన్సర్ గా మారే అవకాశం ఉంది. కనుక కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా చాలా అవసరం.



## ప్రాసెస్ చేయబడిన ఆహారాలు

మన రోజువారి అలవాట్లపై శ్రద్ధ పెట్టడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య క్యాన్సర్ గా మారకుండా మనం జాగ్రత్తపడవచ్చు. ఫ్యాటీ లివర్ సమస్య తగ్గడానికి, ఈ సమస్య రాకుండా నివారించడానికి మన జీవనశైలిలో ఎటువంటి మార్పులు చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం. శీతల పానీయాలు, బిస్కెట్లు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, ఫాస్ట్ ఫుడ్ వంటి వాటిని తీసుకోవడం మానేయాలి. ఇవి నేరుగా కాలేయంలో కొవ్వును పెంచుతాయి. చక్కెర కలిగిన పదార్థాలను తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య వచ్చే అవకాశం 40 శాతం ఎక్కువగా ఉంటుంది. కనుక వీటికి బదులుగా డ్రై ఫ్రూట్స్, కూరగాయలు, పండ్లు, తృణ ధాన్యాలు వంటి వాటిని తీసుకోవాలి. అలాగే రోజూ వ్యాయామం చేయాలి. గంటల తరబడి కూర్చోకూడదు. ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల జీవక్రియ మందగిస్తుంది. కాలేయంలో కొవ్వు పేరుకుపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కనుక వారానికి 150 నిమిషాలు నడక, సైక్లింగ్, ఈత వంటి వ్యాయామాలు చేయాలి.

## నూనెలో వేయించిన ఆహారాలు

నూనెలో బాగా వేయించిన ఆహారాలకు దూరంగా ఉండాలి. వేయించిన ఆహారాలు, పిజ్జాలు, బర్గర్లు వంటి వాటిలో ట్రాన్స్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి కాలేయంపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య తక్కువ సమయంలోనే కాలేయ క్యాన్సర్ గా మారే అవకాశం ఉంది. కనుక వీటికి బదులు ఆలివ్ ఆయిల్ తో చేసిన వంటకాలు తీసుకోవడం, చేపలు, అవకాడో వంటి వాటిని తీసుకోవడం చేయాలి. అలాగే శరీర బరువును కూడా అదుపులో ఉంచుకోవాలి. అధిక శరీర బరువు ఫ్యాటీలివర్ సమస్య రావడానికి ప్రధాన కారణం. అధిక బరువు, పొట్ట చుట్టూ ఎక్కువగా పేరుకుపోయిన కొవ్వు ఇన్సులిన్ నిరోధకతను, ఫ్యాటీ లివర్ సమస్యను పెంచుతుంది. కనుక శరీర బరువును ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవాలి.

## మద్యపానం, ధూమపానం

ఎక్కువగా నీరు తాగడం, సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామం చేయడం వల్ల శరీర బరువు ఎల్లప్పుడూ అదుపులో ఉంటుంది. ఇక మద్యపానం, ధూమపానం రెండూ కూడా ఫ్యాటీ లివర్ కు దారి తీస్తాయి. ఇవి రెండూ కాలేయానికి ప్రధాన శత్రువులు అని చెప్పవచ్చు. ఈ అలవాట్లను కొనసాగించడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్యతో పాటు కాలేయ క్యాన్సర్ వచ్చే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. కనుక ఈ అలవాట్లను వెంటనే మానేయడం మంచిది. వీటికి బదులుగా నీటిని ఎక్కువగా తాగడం, బ్లాక్ టీ, హెర్బల్ టీలను తాగడం అలవాటు చేసుకోవాలి. ఫ్యాటీ లివర్ సమస్య నెమ్మదిగా ప్రమాదంగా మారే అవకాశం ఉంది. కనుక మన రోజూ అలవాట్లల్లో ఈ మార్పులు తప్పకుండా చేసుకోవాలి. ఈ అలవాట్లను పాటించడం వల్ల కాలేయ ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

# మీ చర్మంపై ఈ సంకేతాలు కనిపిస్తుంటే డయాబెటిస్ ఉన్నట్లే నిర్లక్ష్యం చేయకండి

డయాబెటిస్ తో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మన దేశంలో దాదాపు 90 మిలియన్ల మంది డయాబెటిస్ తో బాధపడుతున్నారని 2025 -26 లో నిర్వహించిన ఓ ఆర్థిక సర్వే చెబుతోంది. మారిన మన జీవన విధానం, ఆహారపు అలవాట్లే ఈ సమస్యకు ప్రధాన కారణాలని వైద్యులు చెబుతున్నారు. అధిక దాహం, తరచూ మూత్రవిసర్జన, విపరీతమైన అలసట, దృష్టి లోపాలు వంటి సంకేతాలు డయాబెటిస్ ను తెలియజేస్తాయి. ఇవే కాకుండా మన చర్మం కూడా డయాబెటిస్ సంకేతాలను తెలియజేస్తుంది. కానీ చర్మంపై వచ్చే ఈ మార్పులను చాలా మంది తోసిపుచ్చుతారు. కానీ ఈ లక్షణాలను గమనించి తక్షణ వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యం. డయాబెటిస్ ఉందని చర్మం తెలియజేసే లక్షణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

## డయాబెటిక్ డెర్మోపతి

శరీరం లోపల జీవక్రియ మార్పులు జరిగినప్పుడు, రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు చర్మంపై చిన్న, గుండ్రని, గోధుమ రంగు లేదా ఎరుపు రంగు మచ్చలు అభివృద్ధి చెందుతాయి. ఇవి ఎక్కువగా కాళ్లపై కనిపిస్తాయి. ఈ మచ్చల వల్ల ఎటువంటి నొప్పి, దురద ఉండదు. రక్తనాళాల్లో డయాబెటిస్ కారణంగా జరిగే మార్పులను ఈ మచ్చలు సూచిస్తాయి.

## అకాంథోసిస్ నిగ్రికాన్స్

డయాబెటిస్ కారణంగా మెడ, చంకలపై చర్మం నల్లగా మారుతుంది. అలాగే చర్మం మందంగా తయారవుతుంది. శరీరం ఇన్సులిన్ ను ఉత్పత్తి చేయడానికి ఇబ్బంది పడుతుందని ఈ సంకేతాలు తెలియజేస్తాయి. ఊబకాయం, డయాబెటిస్ తో బాధపడే వారిలో ఈ లక్షణాలు మనకు స్పష్టంగా కనిపిస్తాయి. చర్మం ఇలా రంగు మారడాన్ని గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

## నయం కానీ గాయాలు లేదా నెమ్మదిగా నయం అయ్యే గాయాలు

గాయాలు తగిలినప్పుడు చర్మం సకాలంలో నయం అవ్వదు. చర్మం నయం అవ్వడానికి చాలా సమయం పడుతుంది. డయాబెటిస్ కారణంగా శరీర జీవక్రియ నెమ్మదిగా ఉంటుంది. దీంతో చర్మానికి రక్తప్రవాహం, ఆక్సిజన్, పోషకాలు నెమ్మదిగా అందడం వల్ల గాయాలు నెమ్మదిగా నయం అవుతాయి. అంతేకాకుండా డయాబెటిస్ కారణంగా రోగనిరోధక శక్తి తగ్గుతుంది. బలహీనమైన రోగనిరోధక కణాలు చర్మ కణజాలాన్ని మరమ్మత్తు చేయడం

# షుగర్ ఉన్నవారు రోజూ తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు ఇవే లేదంటే షుగర్ కంట్రోల్ అవదు



డయాబెటిస్ తో బాధపడే వారు రక్తంలో చక్కెర స్థాయిల్లో హెచ్చుతగ్గులను ఎదుర్కొంటూ ఉంటారు. ఆహారంలో మార్పులు, ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం వంటి అనేక కారణాల వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. ముఖ్యంగా ఈ చక్కెర స్థాయిలు ఉదయం సమయంలో ఎక్కువగా ఉంటాయి. తెల్లవారుజామున 3 గంటల నుండి 8 గంటల మధ్యలో రోజంతటికీ శరీరాన్ని సిద్ధం చేయడానికి కార్టిసాల్, గ్లూకాగాన్ వంటి హార్మోన్లు ఎక్కువగా విడుదల అవుతాయి. ఈ హార్మోన్లు ఇన్సులిన్ నిరోధకతను పెంచుతాయి. దీని వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఉదయం పూట ఎక్కువగా ఉంటాయి. రక్తంలో అధికంగా ఉండే ఈ చక్కెర స్థాయిలు మొత్తం శరీర ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. గుండె జబ్బులు, మూత్రపిండాల సమస్యలు, నరాలు దెబ్బతినడం, దృష్టి లోపాలు వంటి అనేక సమస్యలు తలెత్తుతాయి. కనుక రక్తంలో చక్కెర స్థాయిలను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవాలి.

## ఖాళీ కడుపుతో గ్లాస్ నీళ్లు

ఉదయం పూట ఆరోగ్యకరమైన దినచర్యను పాటించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు. కొన్ని చిట్కాలను పాటించడం వల్ల ఉదయం పూట రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా నిరోధించవచ్చు. ఉదయం పూట రక్తంలో చక్కెర స్థాయిలను ముందుగా పరీక్షించుకోవాలి. దీంతో మనం ఎటువంటి ఆహారాన్ని ఎంపిక చేసుకోవాలో తెలుస్తుంది. ఉదయం పూట ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా కార్బొహైడ్రేట్స్ తక్కువగా ఉండే అల్పాహారాన్ని తీసుకోవాలి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా అడ్డుకుంటుంది. నిద్ర లేచిన తరువాత ఒక గ్లాస్ నీటిని తాగాలి. రాత్రంతా నీరు తాగకపోవడం వల్ల ఉదయం పూట శరీరం డీహైడ్రెటెడ్ గా ఉంటుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. నీరు తాగడం వల్ల అదనంగా ఉండే గ్లూకోజ్ బయటకు వెళ్తుంది. కనుక నిద్ర లేచిన తరువాత వెంటనే నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి.

## తేలికపాటి వ్యాయామాలు

రోజూ ఉదయం పూట 10 నుండి 15 నిమిషాల పాటు శరీరానికి సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే అల్పాహారం తీసుకోవడానికి ముందు తేలికపాటి వ్యాయామాలు చేయడం, నడవడం వంటివి చేయాలి. తేలికపాటి వ్యాయామాలు చేయడం వల్ల ఇన్సులిన్ అవసరం లేకుండానే శరీరం నుండి గ్లూకోజ్ బయటకు వెళ్లిపోతుంది. అయితే ఖాళీ కడుపుతో బరువైన వ్యాయామాలు చేయడం మంచిది కాదు. ఉదయాన్నే కార్టిసాల్ స్థాయిలు తగ్గేలా 5 నిమిషాల పాటు లోతైన శ్వాస వ్యాయామాలు చేయడం, ధ్యానం వంటివి చేయడం అలవాటు చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి.

## అల్పాహారం తప్పనిసరి

అలాగే ఉదయం పూట తప్పకుండా అల్పాహారాన్ని తీసుకోవాలి. ఎక్కువ సమయం తినకుండా ఉండడం వల్ల గ్లూకోజ్ ఎక్కువగా విడుదల అవుతుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. ఉదయం పూట చక్కెర కలిగిన జ్యూస్ లు తీసుకోవడం మానేయాలి. ఇవి నేరుగా రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. కనుక చక్కెర లేని జ్యూస్ లు తీసుకోవడం, నీటిలో నిమ్మకాయ కలిపి తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. ఆహారంలో ఆరోగ్యకరమైన కొవ్వులను తీసుకోవాలి. ఇవి కార్బొహైడ్రేట్ల శోషణను తగ్గిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. ఉదయం పూట దినచర్యలో భాగంగా ఈ అలవాట్లను పాటించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా స్థిరంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

# విటమిన్ బి12 లోపం ఉంటే మన శరీరంలో కనిపించే లక్షణాలు ఇవే

12 మన శరీరానికి అవసరమయ్యే బి కాంప్లెక్స్ విటమిన్లలో విటమిన్ బి12 కూడా ఒకటి. దీనిని కోబాలమిన్ అని కూడా పిలుస్తారు. ఇది నీటిలో కరిగే విటమిన్. విటమిన్ బి12 మన శరీరంలో ముఖ్య విధులను నిర్వర్తిస్తుంది. నాడీ కణాల నిర్మాణంలో, ఎర్ర రక్తకణాల నిర్మాణంలో, డీఎన్ఏ సంశ్లేషణకు ఈ విటమిన్ చాలా చాలా అవసరం. శరీరంలో విటమిన్ బి12 లోపించడం వల్ల మనం అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుంది. ఈ విటమిన్ లోపాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల మనం తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం కూడా ఉంది. విటమిన్ బి12 ఉండే ఆహారాలను తీసుకోకపోవడం, జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం లేకపోవడం, రక్తహీనత ఎక్కువగా ఉండడం, ఉదర కుహర వ్యాధులు ఎక్కువగా ఉండడం వంటి కారణాల వల్ల శరీరంలో విటమిన్ బి12 లోపం తలెత్తుతుంది.

## గాయాలు మానడంలో ఆలస్యం

విటమిన్ బి12 లోపించినప్పుడు మనం శరీరం కొన్ని సంకేతాలను ఇస్తుంది. ఈ హెచ్చరికలను ముందుగానే గుర్తించడం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురి కాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. విటమిన్ బి12 లోపాన్ని హెచ్చరికల ద్వారా శరీరం ఏ విధంగా తెలియజేస్తుందో.. ఇప్పుడు తెలుసుకుందాం. శరీరంలో విటమిన్ బి12 లోపించడం వల్ల గాయాలు త్వరగా నయం అవ్వవు. విటమిన్ బి12 లోపించడం వల్ల ఎర్రరక్తకణాల ఉత్పత్తి తగ్గుతుంది. దీంతో శరీరానికి ఆక్సిజన్, రక్తం సరఫరా తగ్గుతాయి. దీంతో గాయాలు నయం అవ్వడానికి సమయం ఎక్కువగా పడుతుంది. విటమిన్ బి 12 లోపించడం వల్ల పాదాల్లో జలదరింపు ఎక్కువగా ఉంటుంది. పాదాల్లో తిమ్మిర్లు, నరాలు దెబ్బతినడం, నడవడం కష్టంగా మారడం వంటి లక్షణాలు విటమిన్ బి12 లోపాన్ని సూచిస్తాయి.

## అలసట, బలహీనత..

వీటితో పాటు విటమిన్ బి12 లోపించడం వల్ల అలసిపోయినట్టుగా, శరీరం బలహీనంగా ఉన్నట్టు ఉంటుంది. వికారం, వాంతులు లేదా విరేచనాలు అవుతాయి. ఆకలి తగ్గడం, శరీర బరువు తగ్గడం కూడా జరుగుతుంది. ఇవే కాకుండా నోరు నొప్పిగా ఉండడం, చర్మం సున్నితంగా మారడం, నాడీ సంబంధిత సమస్యలు తలెత్తడం, కంటిచూపు మందగించడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. విటమిన్ బి12 లోపించడం వల్ల మానసిక సమస్యలు కూడా తలెత్తుతాయి. ఆందోళనగా, గందరగోళంగా ఉంటుంది. చికాకు, డిప్రెషన్ వంటి సమస్యలు మరింత ఎక్కువ అవుతాయి. జ్ఞాపకశక్తి తగ్గుతుంది. మనం ప్రవర్తించే తీరు కూడా మారుతుంది.

## ఎన్టీపీసీ రామగుండంలో జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ఫిబ్రవరి 28న ఎన్నికలు -- 6 పదవులకు ఎన్నికలు

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్‌టీపీసీ రామగుండం పరిధిలోని జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ 2026--2028 కాలానికి నిర్వహించనున్న ఎన్నికల షెడ్యూల్‌ను శుక్రవారం అధికారికంగా విడుదల చేశారు. ఈ ఎన్నికలకు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్గా ముదుగుల శ్రీనివాస్, ఎన్నికల అధికారులుగా రింకు గుప్త కే మహేంద్ర కుమార్ ను నియమించారు. వారు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు.

## 33వ డివిజన్ ప్రజలకు మిట్టపల్లి సతీష్ కుమార్ కృతజ్ఞతలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్‌టీపీసీ పట్టణ అన్నపూర్ణ కాలనీ పరిధిలోని 33వ డివిజన్ ఎన్నికల సందర్భంగా తనకు మద్దతుగా నిలిచిన ప్రజలందరికీ బిజెపి రామగుండం మండల అధ్యక్షుడు 33 వ డివిజన్ బిజెపి అభ్యర్థి మిట్టపల్లి సతీష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో తనపై నమ్మకంతో ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్లకు, ప్రత్యక్షంగా సహకరించిన నాయకులకు, మహిళలకు, యువతకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో, గెలుపు ఓటమితో సంబంధం లేకుండా డివిజన్ ప్రజల ప్రేమాభిమానాలు తనకు ఎల్లవేళలా బలమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ, డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.అలాగే తన వెంట నడిచిన పెద్దలు, మహిళలు, యువత సహకారాన్ని గుర్తుచేసుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ తరఫున పనిచేసిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## అకెనపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన




జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ కృషితో అంతర్గాం మండల పరిధిలోని అకెనపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ గాదె స్రవంతి సుధాకర్ శనివారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామ ప్రజల చిరకాల కోరికైన మెరుగైన రవాణా సౌకర్యం కోసం ఈ రహదారి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని, నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఐలవేణి అనసూర్య, వార్డు సభ్యులు మర్రి రాజ్ కుమార్, రైల్లా సాగర్, మాజీ సర్పంచ్ గంగాధరి శ్రీనివాస్ గౌడ్‌తో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులు, స్థానిక యువత పాల్గొన్నారు. అభివృద్ధి పనుల పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు

## పెద్దపులి తిరుగుతోంది.. జాగ్రత్త!

- కరకగూడెం అడవుల్లో సంచారం.. అడుగులు గుర్తించిన ఫారెస్ట్ టీం..



కరకగూడెం, ఫిబ్రవరి 14: కరకగూడెం మండలంలోని అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నదని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. రాళ్లవాగు వద్ద గల పెద్దమ్మతల్లి ఆలయం వెనుక భాగంలో శనివారం పెద్దపులి పాదముద్రలు గుర్తించామని అటవీ క్షేత్రాధికారి (రేంజర్) తేజస్విని తెలిపారు. రెండు రోజులుగా కరకగూడెం అడవుల్లో సంచరిస్తున్నదని, ముందుగా రాయినిపేట అడవుల్లో పెద్దపులి జాడలు కనిపించాయని అన్నారు.రాయినిపేట నుంచి రాళ్లవాగు మీదుగా కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ రేగళ్ల అడవులకు వెళ్లినట్లుగా జాడలు గుర్తించామని తెలిపారు. రైతులు, పెంపకందారులు తమ పశువులను, జీవాలను మేత కోసం అటవీ ప్రాంతాలకు తీసుకువెళ్లవద్దని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఉచ్చులు, కరెంట్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, పెద్దపులి సంచారంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

### మాక్కాన్ సింగ్ దౌర్జన్య దుర్మార్గపు

# పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓటు వేసారు

- ఎమ్మెల్యే అరాచక పాలనకు మా అభ్యర్థుల విజయమే నిదర్శనం
- నైతిక విజయం బీ.ఆర్.ఎస్ పార్టీ దే
- రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ దౌర్జన్యాలు, కాంగ్రెస్ దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓటేశారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఓడిన తమ బీఆర్ఎస్ అభ్యర్థులు కూడా తక్కువ ఓట్ల తేడాతోనే ఓడిపోయారని తెలిపారు. రామగుండం రాజకీయాల్లో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని, అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలను బెదిరించడం, ప్రజలను ప్రచారానికి రాకుండా అడ్డుకోవడం, అధికార దుర్వినియోగం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు కల్పించినా ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా గొప్ప తీర్పునిచ్చారని పేర్కొన్నారు. ఓటమి పాలైనప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థులు కష్టపడిన తీరు, అధికార పార్టీపై చేసిన పోరాటం అభినందనీయమని ప్రశంసించారు. ఇది నైతికంగా బీఆర్ఎస్ పార్టీ విజయం, ప్రజల విజయమని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అరాచక పాలనకు తమ అభ్యర్థుల విజయం నిదర్శనమని అన్నారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వం అందరికీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థులను సత్కరించారు. ఈ మీడియా సమావేశంలో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు గోపు ఐలయ్య యాదవ్,గా. స్వామి, మురళీధర్ రావు, కార్పొరేటర్లు మేకల సమ్మయ్య, మేకల శారద,ఆవుల శ్యామమణి, రమేష్, కర్క పద్మజ శ్రీనివాస్ రెడ్డి, తాళ్ళ చిన రాజయ్య, నాయకులు మారుతి, కల్వచర్ల కృష్ణవేణి, అచ్చే వేణు, బొడ్డుపెల్లి శ్రీనివాస్, మెతుకు దేవరాజు, గుర్రం పద్మ, జక్కుల తిరుపతి ,పిల్లి రమేష్ చెలుకలపల్లి శ్రీనివాస్, కొలుగూరి సాయి, కిరణ్ జీ తదితరులు పాల్గొన్నారు



# ఓటర్లు కాంగ్రెస్‌ను నమ్మలేదు.. తలసాని శ్రీనివాస్ యాదవ్

- రాష్ట్రంలో డబ్బు, మద్యాన్ని ఏరులై పారించినా ఆ పార్టీని విశ్వసించలే
- ఆ పార్టీ నేతలు ఎన్ని అక్రమాలకు పాల్పడినా హస్తానికి అత్తెసరు సీట్లే
- కాంగ్రెస్ పార్టీ అసలైన రంగు బయటపడేది అసెంబ్లీ ఎన్నికల్లోనే



సిద్దిపేట, ఫిబ్రవరి14: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డబ్బు, మద్యాన్ని ఏరులై పారించినా ప్రజలు విశ్వసించలేదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం గుడ్డిలో మెల్ల అని పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు సహజంగా అధికార పార్టీ వైపు మొగ్గు చూపడం సహజమని తెలిపారు. అయితే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపలేదని అన్నారు.కేసీఆర్ హయాంలో జరిగిన స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో 95 శాతం సీట్లను బీఆర్ఎస్ గెలుచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. 32 జడ్పీ చైర్మన్ స్థానాల్లో విజయం సాధించిందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో చాలాచోట్ల కాంగ్రెస్ పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడి, చివరికి కౌంటింగ్‌లోనూ అక్రమాలకు పాల్పడి గెలిచిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క కార్పొరేషన్‌లోనూ, మెజారిటీ మున్సిపాలిటీల్లోనూ సంపూర్ణ మెజారిటీ సాధించలేదని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బయటపడుతుందని తెలిపారు.

**కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా పురోగమిస్తే, కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో కుదేలైందని తలసాని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో తాగు, సాగునీరు లేక రైతులు పడిన గోసలు చూసిన కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన వెంటనే అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్టులు నిర్మించినట్టు తెలిపారు.గతంలో నీరు, విద్యుత్తు లేక రా ష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తాను టీడీపీ ప్రభుత్వంలో మంత్రి, ఎమ్మెల్యేగా పని చేశానని, అప్పు డు నాలుగైదు గంటలకు మించి కరెంట్ ఉండేది కాదని అన్నారు. కానీ, కేసీఆర్ గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు.. రైతులు, వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నవారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్తు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించినట్టు చెప్పారు.రైతు బంధు పథకాన్ని ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసించిందని అన్నారు. నాడు భూ ముల ధరలు ఆకాశాన్ని తాకితే, కాంగ్రెస్ ప్రభుత్వంలో సరైన విధానాలు లేక రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని ఆందోళన వ్యక్తంచేశారు. నేడు భూములను కోనేవారు లేరని, దీంతో రియల్ ఎస్టేట్‌తోపాటు నిర్మాణ రంగంలో సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు.

# స్టూడెంట్స్ ఫెయిల్.. హెచ్‌ఎంలకు నోటీస్

- 60శాతం లోపు ఫలితాలు వచ్చిన 31 స్కూళ్ల హెడ్‌మాస్టర్లకు షోకాజ్
- విద్యార్థులు ప్రాక్టీస్ టెస్ట్‌కు గైర్హాజర్‌పైనా సీరియస్
- కరీంనగర్ జిల్లాలో అధికారుల తీరుపై ఉపాధ్యాయ సంఘాల గుర్రు




హైదరాబాద్, ఫిబ్రవరి 14 / కరీంనగర్ కమాన్ చౌరస్తా:

వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయడంలో భాగంగా కరీంనగర్ జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రాక్టీస్ టెస్టుల్లో పలువురు ఫెయిలవడం ఆయా బడుల హెచ్‌ఎంలకు తలనొప్పిగా మారిం ది. ఫలితాల్లో వెనుకబడటం, విద్యార్థులు పరీక్షలకు డుమ్మా కొట్టడం లాంటి కారణాలు చూపుతూ 31 మంది ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖాధికారుల షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ విషయం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్సెస్సీ ప్రాక్టీస్ టెస్ట్-1 లో ఆయా పాఠశాలల్లో 60శాతం లోపు విద్యార్థులే ఉత్తీర్ణత సాధించారు. మరికొన్ని పాఠశాలల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. దీనిని జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకున్నది.పాఠశాల స్థాయిలో ప్రణాళిక, పర్యవేక్షణ లోపాలతోనే ఇలా జరిగినట్టు అధికారులు గుర్తించారు. 60శాతం లోపు ఫలితాలొచ్చిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులిచ్చారు. మీపై క్రమశిక్షణ చర్యలెందుకు తీసుకోకూడదో స్పష్టంచేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఫలితాలు తక్కువగా రావడానికి కారణాలు ఏంటో తెలిపాలని కోరారు. ఫలితాలు మెరుగయ్యేందుకు తీసుకునే చర్యలతో పాటు విద్యార్థుల గైర్హాజరుకు కారణాలపై ఆరా తీశారు. కొందరు హెచ్‌ఎంలు ఎంఈవోలుగా అదనపు బాధ్యతల్లో ఉన్నారని, అనేక పనులు అప్పగించి షోకాజ్ నోటీసులివ్వడం ఎంత వరకు సబబని ఉపాధ్యాయ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ నోటీసులను ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.పాలమూరు కార్పొరేషన్‌పై పీఠముడి ఒకవైపు అధికారం, మరోవైపు పోలీస్ యంత్రాంగం సహకారం ఇంకోవైపు ఎన్నికల అధికారుల అండదండలతో తాము అనుకున్నది సాధించారు. అయినా మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో మెజార్టీకి దూరంగా నిలిచిపోయారు. ఎక్కడ మేయర్ పదవి చేజారుతుందో అన్న భయంతో రాత్రికి రాత్రి క్యాంప్ రాజకీయాలకు తెరలేపారు. అర్ధరాత్రి గెలిచిన కార్పొరేటర్లను క్యాంప్ ఆఫీసుకు పిలిపించి బస్సుల్లో ఆంధ్రాకు తరలించారు

## సింగరేణి డాకర్ల నిర్లక్ష్యం ఖరీదు...

# యువకుడు నవీన్ ప్రాణం బలి..

- అంబులెన్స్ లో ఎస్కార్ట్ లేకుండా హైదరాబాద్ కు రిఫర్ చేసారు..
- ఊపిరాడక మార్గమధ్యంలోనే ప్రాణంవదిలిన వైనం...
- సింగరేణి వైద్యం గొప్పలు ప్రచారానికే పరిమితం.

భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం / ఫిబ్రవరి 14 / అక్షరం న్యూస్ – :

కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా సింగరేణి ఉద్యోగి కుమారుడి ప్రాణం బలి అయింది. సింగరేణి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని ఎమర్జెన్సీ కేసులను సైతం హైదరాబాదులోని పెద్ద ఆసుపత్రుల్లో ఆధునిక చికిత్సలు అందిస్తున్నట్లు యాజమాన్యం ప్రచారం చేయడం తప్ప కార్య రూపంలో శూన్యంగా కనిపిస్తుంది. కొత్తగూడెం 5 షాఫ్ట్ లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగి బాల నాగేశ్వరరావు కుమారుడు నవీన్ (29) స్థానిక వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శనివారం మరణించాడని ఆరోపణలు వస్తున్నాయి. మూడేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న

నవీన్ ను తల్లిదండ్రులు కంటికి రెప్పలా చూసుకుంటూ తనయుణ్ణి కాపాడుకునేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. సింగరేణి అందిస్తున్న వైద్యంపై భరోసాతో డాక్టర్ల ప్రతి సూచనలు పాటిస్తూ వస్తున్న ఆ కుటుంబానికి వైద్యుల నిలువెత్తు నిర్లక్ష్యం షరాఘాతంగా మారింది. నవీన్ ప్రాణాలు కోల్పోవడంతో తీవ్ర కడుపుకోతకు గురైన ఆ కుటుంబంతో పాటు ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులు కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున సింగరేణి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. నవీన్ ఆరోగ్యం చేనుంచటంతో ఇక్కడి ప్రధాని ఆసుపత్రి నుంచి హైదరాబాద్ లో చికిత్స కోసం రిఫర్ చేశారు. ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ లో తరలిస్తున్న క్రమంలో ఖమ్మం సమీపంలోని పల్లిపాడు వద్ద



ఊపిరి ఆడక అంబులెన్స్ లోనే నవీన్ చాలా విషాదంగా మృతి చెందాడు. అత్యవసర పరిస్థితి ఉందని వైద్యులకు తెలిసినప్పటికీ ఆక్సిజన్ ఆపరేటర్స్ ఏర్పాటు చేయలేకపోయారు. దానికి తోడు అంబులెన్స్ లో ఏసీ కూడా పని చేయడం లేదని విమర్శలు. అసలే తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న నవీన్ వెంట కనీసం ఒక వైద్య చికిత్సలో తర్ఫీదు ఉన్న ఎస్కార్ట్ ను పంపించాల్సి ఉంది. బీటెక్ చదువుకున్న నవీన్ కు ఊపిరితిత్తుల క్యాన్సర్ ఉన్నట్లు తెలుస్తోంది. దానికి తోడు బోన్ క్యాన్సర్ కూడా సంక్రమించినట్లు తెలిసింది. ఇతనికి కీమో చికిత్సలు కూడా పూర్తిస్థాయిలో అందాయి. ఎంతో కొంత కోరుకుంటున్నా దశలో హైదరాబాద్ వైద్యుల సూచన మేరకు హ్యుమానిటీ ఇంజక్షన్లు ఇవ్వాల్సిందిగా సింగరేణి వైద్యులకు సూచనలు చేసారని అయినప్పటికీ నిర్లక్ష్యం చేశారని సచేమీరా ఆ ఇంజక్షన్లు చేయమని వైద్యులు తిరస్కరించినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొడుకును ఎంతో గారాబంగా చూసుకుంటూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలలుగన్న తల్లిదండ్రుల ఆశలను



సింగరేణి వైద్యులు తమ నిర్లక్ష్యంతో కడుపుకోతను మిగుల్చారని విమర్శలు వస్తున్నాయి. మూడేళ్లుగా చికిత్స తీసుకుంటున్న నవీన్ ఎంతో కొంత కోరుకుంటున్నారని తల్లిదండ్రులు చెప్తున్నారు. ఇలాంటి క్రిటికల్ కేసుల విషయంలో అంబులెన్స్ ఏర్పటు శాస్త్రీయంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా చాలా నిర్లక్ష్యం చేశారని దీంతో యువకుడి ప్రాణాలు కోల్పోయాడని గుర్తింపు సంఘం నాయకులు వంగ వెంకట్ హుమాయున్ ఆరోపిస్తున్నారు. యువకుడి శవంతో సింగరేణి ఆసుపత్రి వద్ద నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో వీరు మద్దతుగా నిలబడ్డారు. ఎమర్జెన్సీ కేసు విషయంలో అంబులెన్స్ లో సి ఆర్ పి తో పాటు ఆక్సిజన్ ఆన్ చేసి ఉంచాలని ఒక తర్ఫీదు పొందిన సిబ్బంది ఎస్కార్ట్ గా పంపించాల్సి ఉంటుందని నాయకులు వెల్లడిస్తున్నారు. స్థానిక వైద్యులు ఇవేమీ పట్టించుకోకుండా ఘోరమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారని అందుకే యువకుడు నవీన్ ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో లో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్,బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి,కేంద్ర కౌన్సిల్ సభ్యులు హుమాయూన్,రాము,రాజేశ్వరరావు,నరేష్,మురళి,రవీంద ర్, శ్యామ్,పల్నాటి ప్రశాంత్, నాగయ్య,నితిన్,క్రిస్టఫర్,ఎర్రగాని కృష్ణ,ఓం,వాసు,మడిపల్లి శ్రీనివాస్ తాతిదారులు పాల్గొన్నారు.

# పుల్వామా అమరులకు ఘన నివాళులు

- ర్యాలీలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )ఫిబ్రవరి 14:

పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన 40 మంది సిఆర్ పి ఎఫ్ జవాన్లను స్మరించుకుంటూ ఫిబ్రవరి 14ను 'బ్లాక్ డే'గా పాటించారు. మాజీ కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. హనుమకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ సిగ్నల్ పాయింట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ర్యాలీ లో పాల్గొని అమరవీరులకు ఎంపీ నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ,దేశం కోసం





ప్రాణత్యాగం చేసిన జవాన్ల త్యాగం, దేశభక్తి ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచిపోతాయని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని తెలిపారు.

కొవ్వొత్తుల వెలుగుతో అమరుల జ్ఞాపకాలను స్మరించుకుంటూ, వారి అజేయ ఆత్మస్థైర్యానికి వందనం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సురేందర్ నాథ్, వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్. నారాయణ చారి, జనరల్ సెక్రెటరీ, ఎలిగేటి శ్రీనివాస్, కోశాధికారి కిషోర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిడిగొండలో ఉచిత వైద్య శిబిరం



జనగామజిల్లా /రఘునాథపల్లి/(అక్షరం న్యూస్), ఫిబ్రవరి 14:

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకొని ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని నిడిగొండ సర్పంచ్ బొమ్మ వీరస్వామి అన్నారు. మండలంలోని నిడిగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద హైదరాబాద్ కు చెందిన మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంను సర్పంచ్ బొమ్మ వీరస్వామి ప్రారంభించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. శిబిరంలో స మారు 113 మందికి ఉచితంగా బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దగ్గు, దమ్ము, జ్వరం, ఆయాసం, నడుము నొప్పి, జలుబు, దురద, రక్త హీనత ఉన్న వారికి టానిక్ తో పాటు మందులను ఇచ్చారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ప్రత్యేక బస్సులో హైదరాబాద్ ఆస్పత్రికి తీసకెళ్లి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలోఉప సర్పంచ్ లక్ష్మారెడ్డి, డాక్టర్లు భానుతేజ, సమన్వి, శ్రీవిద్య, క్యాంపు ఆర్గనైజర్ వెంకట్, దేవదాసు, భరత్ పాల్గొన్నారు.

## మక్కాన్సింగ్ మనవరాలు నామకరణ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ , మనాలి ఠాకూర్ పుత్రిక నూకలపాటి మానస -- అనుత్తమ్ దంపతుల పుత్రిక నామకరణ మహోత్సవం హైదరాబాద్లోని రాజ్ ఠాకూర్ నివాసంలో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రేవంత్ రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ పాల్గొని దువ కి ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య రాష్ట్ర నాయకులు, సోదరులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులు ఈ వేడుకలు పాల్గొన్నారు.

## న్యాయవాదిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి


- న్యాయవాది హత్య పట్ల ఖండన.
- తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలి.
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్.



భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం / ఫిబ్రవరి 14/ అక్షరం న్యూస్ –:

హైదరాబాద్ అత్తాపూర్ లో న్యాయవాది మహమ్మద్ ఖదీర్ ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం లేకపోవడం మూలంగా న్యాయవాదులపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంకా ఎంతమంది న్యాయవాదులపై దాడులు జరిగి, ఎంతమంది న్యాయవాదులు చనిపోయిన తర్వాత న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేస్తారని ప్రశ్నించారు. 15రోజుల వ్యవధిలో రాష్ట్రంలో ఇద్దరు న్యాయవాదులు హత్యకు గురికావడం హేయమన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడులుగా అభివర్ణించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని, హోమ్ శాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాంతి భద్రతల విషయంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఓదెలచాక్ పీస్ పై శివలింగాన్ని చెక్కిన సూక్ష్మ కళాకారుడు ఆడెపు రజనీకాంత్





ఓదెల/పెద్దపల్లి ఫిబ్రవరి 14(అక్షరం న్యూస్)

ఓదెల మండలం లోని మడక గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు పాడెపు రజనీకాంత్ చాక్ పీస్ పై శివలింగాన్ని చెక్కి రికార్డు సృష్టించారుమహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన ప్రభుత్వ చిత్రకళ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ తన ప్రత్యేక ప్రతిభను మరో సారి చాటిచెప్పారు. కేవలం 1.3 సెంటీమీటర్ల ఎత్తు, 1.5 సెంటీమీటర్ల వెడల్పు కలిగిన శివలింగాన్ని సాధారణ చాక్‌పీస్‌పై గుండు పిన్ను సహాయంతో సుమారు గంటన్నర పాటు శ్రమించి సూక్ష్మ రూపంలో మలిచారు. అత్యంత నైపుణ్యం, ఓర్పు, ఏకాగ్రతతో రూపొందించిన ఈ కళాఖండం మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇంతకుముందు కూడా శివరాత్రి సందర్భంగా 1.5 సెంటీమీటర్ల ఎత్తు గల 109 శివలింగాలను చాక్‌పీస్‌లపై తయారు చేసి ప్రశంసలు అందుకున్నారు. అదేవిధంగా ప్రపంచంలోనే అతి చిన్న జాతీయ జెండాను రూపొందించి "క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్"లో స్థానం సంపాదించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. గ్రామీణ ప్రాంతం నుంచి వెలుగొందుతున్న ఈ కళాకారుడు తన సృజనాత్మకతతో యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహాశివరాత్రి శుభాకాంక్షలను తన కళారూపంలో వ్యక్తపరచిన రజనీకాంత్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు.

## నిడిగొండ త్రికూటాలయాన్ని సందర్శించిన మహిళా కళాశాల విద్యార్థినులు



జనగామజిల్లా/ రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)పిబ్రవరి 14:

మండలంలోని నిడిగొండ త్రికూటాలయాన్ని హన్మకొండ పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు శనివారం సందర్శించి ఆలయ ప్రాముఖ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ ఆఫ్ కాలేజ్ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జిజ్ఞాస పోటీలకు ఈ సంవత్సరం కాకతీయుల కాలం నాటి ఆలయాల ప్రాముఖ్యత అం శాన్ని ఎంచుకోవడం జరిగిందని కళాశాల చరిత్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయుల కాలం నాటి శిల్పాలయంలోని శిల్పాలు చెల్లాచెదురుగా పడి ఉండడం చాలా బాదకరమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పురావస్తు శాఖ పర్యవేక్షణలో గ్రామస్థుల సహకారంతో ఆలయాన్ని పునర్ ప్రతిష్ఠించాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే విద్యార్థినులు గ్రామంలో కొండపై ఉన్న నరసింహా స్వామి ఆలయంతో పాటు అంజనేయస్వామి ఆలయం. వైష్ణవాలయం. సూర్య భగవాన్ ఆలయం. త్రికూటాలయం కోనేరును సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, అధ్యాపకులు ఎం.బాలరాజు, జ్యోతి, విద్యార్థినులు స్వప్న, శ్రీలత, కావేరి, హూజిత, సంజన, బిందుప్రియ, వైష్ణవి, ఆలయ అర్చకులు కెవిజికె ఆచార్య. శ్రీకటాక్షం తదితరులు పాల్గొన్నారు.

# తాండూరు 'కార్తికేయ' మిల్లులో
# బియ్యం బాగోతం పట్టుబడ్డ ఆంధ్రా లారీ..

- అధికారుల మౌనం వెనుక మర్మమేంటి?
- లారీ అసోసియేషన్ సభ్యుల కథనం ప్రకారం.. యూరియా సంచుల్లో కాకినాడకు బియ్యం ఎగుమతి!



మంచిర్యాల జిల్లా /?తాండూరు /ఫిబ్రవరి 14/అక్షరం న్యూస్ –

ప్రభుత్వ బియ్యం పక్కదారి పడుతున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా మిల్లు యజమానులు అక్రమ దందాకు తెరలేపారా? తాండూరు మండలంలో తాజాగా వెలుగు చూసిన ఘటన చూస్తుంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కార్తికేయ ఇండస్ట్రీస్ (ఖుతీష్ట్రఅనివఖు ×అఎబర్తీఅవం) మిల్లు నుండి రాత్రికి రాత్రే ఆంధ్రప్రదేశ్‌కు తరలుతున్న బియ్యం లారీని స్థానిక లారీ అసోసియేషన్ సభ్యులు పట్టుకోవడం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

### లారీ అసోసియేషన్ సభ్యుల కథనం ప్రకారం:

ఐబీ తాండూరు లారీ అసోసియేషన్ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పట్టపగలే ఆంధ్రాకు చెందిన లారీలో బియ్యం లోడింగ్ చేసి, రాత్రికి రాత్రే కాకినాడ పోర్టుకు తరలించేందుకు ప్రయత్నించారు. స్థానిక అసోసియేషన్ లారీలను కాదని, వేరే రాష్ట్రానికి చెందిన వాహనాన్ని ఉపయోగించడంతో అనుమానం వచ్చిన సభ్యులు, లారీని అడ్డుకుని నిలదీశారు. వే–బిల్లులు లేకుండా టన్నుల కొద్దీ బియ్యం తరలిస్తున్న ఈ అక్రమ దందా అసోసియేషన్ సభ్యుల చొరవతోనే వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన వాహనం ప్రస్తుతం అసోసియేషన్ కార్యాలయ ఆవరణలోనే ఉన్నా, అటు మిల్లు యజమాని గానీ, ఇటు లారీ ఓనర్ గానీ అక్కడకు రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని సభ్యులు పేర్కొంటున్నారు.

### అధికారులను నిలదీస్తున్న ప్రశ్నలివే:

వే–బిల్లులు ఎక్కడ?: టన్నుల కొద్దీ బియ్యం సరిహద్దులు దాటుతున్నా, కనీసం వే–బిల్లులు లేకపోవడం అధికారుల కళ్లకు కనిపించడం లేదా?

మూవ్‌మెంట్ ఆర్డర్ ఉందా?: ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ ధాన్యం లేదా బియ్యం తరలించడానికి సివిల్ సప్లై శాఖ నుండి ఖచ్చితంగా ఉండాల్సిన 'మూవ్‌మెంట్ ఆర్డర్' ఈ లారీకి ఉందా?

రంగు సంచుల మాయాజాలం: ప్రభుత్వ బియ్యం అయితే ఖచ్చితంగా మార్కింగ్ ఉన్న గోనె సంచుల్లో ఉండాలి. కానీ, యూరియా మరియు ఇతర ఎరువుల సంచుల్లో బియ్యాన్ని ఎందుకు నింపారు? ఇది అధికారుల కళ్లు గప్పడానికి చేస్తున్న ప్రయత్నం కాదా?

ఆరోగ్యంతో చెలగాటం: రసాయన ఎరువులు నింపిన సంచులను ఆహార గింజల నిల్వకు వాడకూడదనే నిబంధన ఉన్నా, రంగు సంచుల్లో బియ్యం నింపడం 'ఫుడ్ సేఫ్టీ' చట్టాల ఉల్లంఘన కాదా?

### ఆరోపణల మునకలో మిల్లు యజమాన్యం:

కార్తికేయ ఇండస్ట్రీస్ యాజమాన్యం ప్రభుత్వం ఇచ్చిన సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఏపీకి చెందిన ఆూ07ుఓ7395 నంబర్ గల లారీని ఉపయోగిస్తూ, లోపల ఉన్నది ప్రభుత్వ ధాన్యమా లేక పేదలకు అందాల్సిన రేషన్ బియ్యమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నూతనంగా ఏర్పాటైన ఈ మిల్లుకు ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి పెట్టకుండా, ఇతర రాష్ట్రాలకు తరలించి అమ్ముకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### విచారణ జరిగితేనే అసలు బండారం బయటపడుతుంది!లి

?కేవలం ఒక్క లారీతోనే ఈ దందా ఆగిందా? లేక గత కొద్ది రోజులుగా ఈ "రంగు సంచుల" అక్రమ రవాణా కొనసాగుతోందా? అన్నది తేలాల్సి ఉంది. మిల్లులోని విద్యుత్ వినియోగం, స్టాక్ రిజిస్టర్లు, మరియు ఏపీ నుండి వచ్చిన ధాన్యం బిల్లులను క్షుణ్ణంగా పరిశీలిస్తే పెద్ద కుంభకోణమే బయటపడే అవకాశం ఉంది. జిల్లా కలెక్టర్ మరియు విజిలెన్స్ అధికారులు తక్షణమే స్పందించి, మిల్లు యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్

# క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌లి

మంచిర్యాల జిల్లా /మంచిర్యాల /ఫిబ్రవరి 14 /అక్షరం న్యూస్–

క్రీడల ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలు, జట్టు భావన పెంపొందుతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో కొనసాగుతున్న సి.ఎం. కప్––2025 పోటీలకు జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి తదితర అధికారులతో కలిసి హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికే ప్రభుత్వం సి.ఎం. కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రశాంతత అలవాటవుతుందని చెప్పారు. జట్టు క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్ ప్రాముఖ్యత తెలిసి కలిసి పనిచేసే నైపుణ్యం పెరుగుతుందని వివరించారు. గెలుపు, ఓటములు సహజమని, ఓటమితో నిరుత్సాహపడకుండా క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.





ఒకసారి ఫలితం రాకపోయినా పట్టుదలతో శ్రమిస్తే విజయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సి.ఎం. కప్‌లో గ్రామీణ, మండల, నియోజకవర్గ స్థాయి పోటీలను పూర్తి చేసి జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామని, ఇక్కడ విజయం సాధించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల నుండి దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్, రోలర్ స్కేటింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, సైక్లింగ్ తదితర క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారని చెప్పారు. ఎన్నికల సమయంలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం నుండి ఒలింపిక్స్ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, క్రీడల కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారులు ఏకాగ్రతతో శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పెగడపల్లిలో వైభవంగా శివపార్వతుల కళ్యాణం



కాల్వ శ్రీరాంపూర్ / ఫిబ్రవరి 14 / అక్షరం న్యూస్:

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని పెగడపల్లి గ్రామంలోని శివాలయంలో శనివారం వేద పండితులు స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామస్తులు తలంబ్రాలను తీసుకొచ్చారు దేవాలయం శివనామస్మరణతో మార్మోగింది స్వామివారి కళ్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు ఈ పూజా కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆరెల్లి రమేష్ ,ఉపసర్పంచ్ పత్తి శ్రీనివాస్ రెడ్డి , మరియు వార్డు సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## సహజ వనరులను కాపాడుకుందాం




జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్), ఫిబ్రవరి 14:

ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను కాపాడుకుంటూ భవిష్యత్తు తరాలను ర క్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య అన్నారు. ఇందన పరిరక్షణపై సాక్ష్యం 2026 లో భాగంగా హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రఘునాథపల్లి ఆర్.జె. ఫిల్లింగ్ స్టేషన్ లో శనివారం అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ సిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య మాట్లాడుతూ భూగర్భంలో లభించే ఇంధనాలు డీజిల్తో పాటు పెట్రోల్, గ్యాస్ పరిమితిని మించి వినియోగిస్తే భావితరాలకు కొరత ఏర్పడుతుందని, దీంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశముందని అన్నారు. సిగ్నల్ లైట్ల వద్ద ఇంజను నిలిపివేయాలని, దీని వల్ల ఇంధనం పొదుపు ఆవడమే కాకుండా వాయు, శబ్ద కాలుష్యం కుడా తగ్గుతుందని అన్నారు. వాహనాల వాడకం వద్దు.. నడకనే ముద్దు అనే నినాదంతో పెట్రోల్ బంకుల యాజమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్య క్రమంలో సెల్స్ ఆఫీసర్ రాహుల్ శర్మ, కోళ్ల సురేష్, పరుశరాములు, కిష్టయ్య, హరీష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ డే సందర్భంగా వీర జవాన్లకు నివాళు లర్పించిన అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్




అంజయ్యనగర్ డివిజన్ క్రైమ్ ప్రతినిధి ఫిబ్రవరి 14:

2019 ఫిబ్రవరి 14 రోజు జరిగిన పుల్వామా దాడిలో అమరవీరులైనటువంటి జవాన్ల కు నివాళులర్పించే కార్యక్రమం సైనిక్ టీం నాగరాజు ఆధ్వర్యంలో సిద్ధిక్ నగర్ లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ పాల్గొని నివాళు అర్పించి, పిల్లలకు సైనిక్ టీం వారు ఏర్పాటు చేసినా బ్యాగులు పంపిణీ చేయడం జరిగింది. వారితో పాటు బస్తీ నాయకులు లక్ష్మీబాయి, గువ్వల రమేష్, సాగర్, ఆనంద్ టీం సైనిక్ సభ్యులు, సిద్దిక్ నగర్ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నోబెల్ హై స్కూల్ విద్యార్థుల ఘనతకు అభినందనలు



పెద్దపల్లి టౌన్ ఫిబ్రవరి 14 అక్షరం న్యూస్

నోబెల్ హై స్కూల్, పెద్దకల్వల విద్యార్థులు సౌత్ ఇండియా హ్యాండ్ రైటింగ్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరచి సౌత్ ఇండియా స్థాయి మరియు రాష్ట్ర స్థాయి బహుమతులు అందుకున్నారు ఈ అవార్డులను ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ గ్రంథాలయ చైర్మన్ డాక్టర్. రియాజ్, మరియు అక్షర అకాడమీ చైర్మన్ మీరజ్ చేతుల మీదుగా అందుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీ ట్రస్ట్ భవన్ లోని ప్రకాశం హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. విద్యార్థుల కృషి, గురువుల మార్గదర్శనం, తల్లిదండ్రుల ప్రోత్సాహం కలిసి ఈ విజయాన్ని సాధ్యంచేశాయి. నోబెల్ హై స్కూల్‌కు ఇది గర్వకారణం. విద్యార్థులను నోబెల్ హై స్కూల్ కరెస్పాండెంట్ డాక్టర్ ఈ. మోహన్ రాజా .హెచ్ యం ప్రనీత హ్యాండరైటింగ్ టీచర్ జి .శ్రీలత మరియు ఉపాధ్యాయులు అభినందించారు

## మాజీ సర్పంచ్ సతీష్ జన్మదిన వేడుకలు



కాల్వ శ్రీరాంపూర్/ ఫిబ్రవరి 14/ అక్షరం న్యూస్:

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మాదాసి సతీష్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం పలువురు నాయకులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేస్తూ రానున్న రోజుల్లో మరెన్నో పదవులు పొందాలని ఇలాంటి జన్మదిన వేడుకలను ఎన్నో జరుపుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బంగారి రమేష్, జనగామ అన్వేష్, ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షులు ఎండి రహీం ఖాన్, తాండ్ర సురేష్, సదయ్య,దారంగుల నరేందర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ రామగుండంలో జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ఫిబ్రవరి 28న ఎన్నికలు -- 6 పదవులకు ఎన్నికలు

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్‌టీపీసీ రామగుండం పరిధిలోని జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ 2026--2028 కాలానికి నిర్వహించనున్న ఎన్నికల షెడ్యూల్‌ను శుక్రవారం అధికారికంగా విడుదల చేశారు. ఈ ఎన్నికలకు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్గా ముడుగుల శ్రీనివాస్, ఎన్నికల అధికారులుగా రింకు గుప్త కే మహేంద్ర కుమార్ ను నియమించారు. వారు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు.

## 33వ డివిజన్ ప్రజలకు మిట్టపల్లి సతీష్ కుమార్ కృతజ్ఞతలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్‌టీపీసీ పట్టణ అన్నపూర్ణ కాలనీ పరిధిలోని 33వ డివిజన్ ఎన్నికల సందర్భంగా తనకు మద్దతుగా నిలిచిన ప్రజలందరికీ బిజెపి రామగుండం మండల అధ్యక్షుడు 33 వ డివిజన్ బిజెపి అభ్యర్థి మిట్టపల్లి సతీష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో తనపై నమ్మకంతో ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్లకు, ప్రత్యక్షంగా సహకరించిన నాయకులకు, మహిళలకు, యువతకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో, గెలుపు ఓటమితో సంబంధం లేకుండా డివిజన్ ప్రజల ప్రేమాభిమానాలు తనకు ఎల్లవేళలా బలమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ, డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.అలాగే తన వెంట నడిచిన పెద్దలు, మహిళలు, యువత సహకారాన్ని గుర్తుచేసుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ తరఫున పనిచేసిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## అకెనపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన




జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ కృషితో అంతర్గాం మండల పరిధిలోని అకెనపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ గాదె స్రవంతి సుధాకర్ శనివారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామ ప్రజల చిరకాల కోరికైన మెరుగైన రవాణా సౌకర్యం కోసం ఈ రహదారి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని, నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఐలవేణి అనసూర్య, వార్డు సభ్యులు మర్రి రాజ్ కుమార్, రైల్లా సాగర్, మాజీ సర్పంచ్ గంగాధరి శ్రీనివాస్ గౌడ్‌తో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులు, స్థానిక యువత పాల్గొన్నారు. అభివృద్ధి పనుల పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు

## పెద్దపులి తిరుగుతోంది.. జాగ్రత్త!

- కరకగూడెం అడవుల్లో సంచారం.. అడుగులు గుర్తించిన ఫారెస్ట్ టీం..



కరకగూడెం, ఫిబ్రవరి 14: కరకగూడెం మండలంలోని అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నదని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. రాళ్లవాగు వద్ద గల పెద్దమ్మతల్లి ఆలయం వెనుక భాగంలో శనివారం పెద్దపులి పాదముద్రలు గుర్తించామని అటవీ క్షేత్రాధికారి (రేంజర్) తేజస్విని తెలిపారు. రెండు రోజులుగా కరకగూడెం అడవుల్లో సంచరిస్తున్నదని, ముందుగా రాయినిపేట అడవుల్లో పెద్దపులి జాడలు కనిపించాయని అన్నారు.రాయినిపేట నుంచి రాళ్లవాగు మీదుగా కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ రేగళ్ల అడవులకు వెళ్లినట్లుగా జాడలు గుర్తించామని తెలిపారు. రైతులు, పెంపకందారులు తమ పశువులను, జీవాలను మేత కోసం అటవీ ప్రాంతాలకు తీసుకువెళ్లవద్దని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఉచ్చులు, కరెంట్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, పెద్దపులి సంచారంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

## మాక్కాన్ సింగ్ దౌర్జన్య దుర్మార్గపు
# పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓటు వేసారు

- ఎమ్మెల్యే అరాచక పాలనకు మా అభ్యర్థుల విజయమే నిదర్శనం
- నైతిక విజయం బీ.ఆర్.ఎస్ పార్టీ దే
- రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఫిబ్రవరి 14 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ దౌర్జన్యాలు, కాంగ్రెస్ దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓటేశారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఓడిన తమ బీఆర్ఎస్ అభ్యర్థులు కూడా తక్కువ ఓట్ల తేడాతోనే ఓడిపోయారని తెలిపారు. రామగుండం రాజకీయాల్లో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని, అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలను బెదిరించడం, ప్రజలను ప్రచారానికి రాకుండా అడ్డుకోవడం, అధికార దుర్వినియోగం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు కల్పించినా ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా గొప్ప తీర్పునిచ్చారని పేర్కొన్నారు. ఓటమి పాలైనప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థులు కష్టపడిన తీరు, అధికార పార్టీపై చేసిన పోరాటం అభినందనీయమని ప్రశంసించారు. ఇది నైతికంగా బీఆర్ఎస్ పార్టీ విజయం, ప్రజల విజయమని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అరాచక పాలనకు తమ అభ్యర్థుల విజయం నిదర్శనమని అన్నారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వం అందరికీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థులను సత్కరించారు. ఈ మీడియా సమావేశంలో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు గోపు ఐలయ్య యాదవ్,గా. స్వామి, మురళీధర్ రావు, కార్పొరేటర్లు మేకల సమ్మయ్య, మేకల శారద,ఆవుల శ్యామమణి, రమేష్, కర్క పద్మజ శ్రీనివాస్ రెడ్డి, తాళ్ళ చిన రాజయ్య, నాయకులు మారుతి, కల్వచర్ల కృష్ణవేణి, అచ్చే వేణు, బొడ్డుపెల్లి శ్రీనివాస్, మెతుకు దేవరాజు, గుర్రం పద్మ, జక్కుల తిరుపతి ,పిల్లి రమేష్ చెలుకలపల్లి శ్రీనివాస్, కొలుగూరి సాయి, కిరణ్ జీ తదితరులు పాల్గొన్నారు



# ఓటర్లు కాంగ్రెస్‌ను నమ్మలేదు.. తలసాని శ్రీనివాస్ యాదవ్

- రాష్ట్రంలో డబ్బు, మద్యాన్ని ఏరులై పారించినా ఆ పార్టీని విశ్వసించలే
- ఆ పార్టీ నేతలు ఎన్ని అక్రమాలకు పాల్పడినా హస్తానికి అత్తెసరు సీట్లే
- కాంగ్రెస్ పార్టీ అసలైన రంగు బయటపడేది అసెంబ్లీ ఎన్నికల్లోనే



సిద్దిపేట, ఫిబ్రవరి14: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డబ్బు, మద్యాన్ని ఏరులై పారించినా ప్రజలు విశ్వసించలేదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం గుడ్డిలో మెల్ల అని పేర్కొన్నారు. శనివారం సిద్ధిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు సహజంగా అధికార పార్టీ వైపు మొగ్గు చూపడం సహజమని తెలిపారు. అయితే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపలేదని అన్నారు.కేసీఆర్ హయాంలో జరిగిన స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో 95 శాతం సీట్లను బీఆర్ఎస్ గెలుచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. 32 జడ్పీ చైర్మన్ స్థానాల్లో విజయం సాధించిందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో చాలాచోట్ల కాంగ్రెస్ పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడి, చివరికి కౌంటింగ్‌లోనూ అక్రమాలకు పాల్పడి గెలిచిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క కార్పొరేషన్‌లోనూ, మెజారిటీ మున్సిపాలిటీల్లోనూ సంపూర్ణ మెజారిటీ సాధించలేదని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బయటపడుతుందని తెలిపారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా పురోగమిస్తే, కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో కుదేలైందని తలసాని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో తాగు, సాగునీరు లేక రైతులు పడిన గోసలు చూసిన కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన వెంటనే అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్టులు నిర్మించినట్టు తెలిపారు.గతంలో నీరు, విద్యుత్తు లేక రా ష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తాను టీడీపీ ప్రభుత్వంలో మంత్రి, ఎమ్మెల్యేగా పని చేశానని, అప్పు డు నాలుగైదు గంటలకు మించి కరెంట్ ఉండేది కాదని అన్నారు. కానీ, కేసీఆర్ గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు.. రైతులు, వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నవారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్తు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించినట్టు చెప్పారు.రైతు బంధు పథకాన్ని ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసించిందని అన్నారు. నాడు భూ ముల ధరలు ఆకాశాన్ని తాకితే, కాంగ్రెస్ ప్రభుత్వంలో సరైన విధానాలు లేక రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని ఆందోళన వ్యక్తంచేశారు. నేడు భూములను కొనేవారు లేరని, దీంతో రియల్ ఎస్టేట్‌తోపాటు నిర్మాణ రంగంలో సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు.

# స్టూడెంట్స్ ఫెయిల్.. హెచ్‌ఎంలకు నోటీస్

- 60శాతం లోపు ఫలితాలు వచ్చిన 31 స్కూళ్ల హెడ్‌మాస్టర్లకు షోకాజ్
- విద్యార్థులు ప్రాక్టీస్ టెస్ట్‌కు గైర్హాజర్‌పైనా సీరియస్
- కరీంనగర్ జిల్లాలో అధికారుల తీరుపై ఉపాధ్యాయ సంఘాల గుర్రు



హైదరాబాద్, ఫిబ్రవరి 14 / కరీంనగర్ కమాన్ చౌరస్తా:

వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయడంలో భాగంగా కరీంనగర్ జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రాక్టీస్ టెస్టుల్లో పలువురు ఫెయిలవడం ఆయా బడుల హెచ్‌ఎంలకు తలనొప్పిగా మారిం ది. ఫలితాల్లో వెనుకబడటం, విద్యార్థులు పరీక్షలకు డుమ్మా కొట్టడం లాంటి కారణాలు చూపుతూ 31 మంది ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖాధికారుల షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ విషయం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్సెస్సీ ప్రాక్టీస్ టెస్ట్-1 లో ఆయా పాఠశాలల్లో 60శాతం లోపు విద్యార్థులే ఉత్తీర్ణత సాధించారు. మరికొన్ని పాఠశాలల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. దీనిని జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకున్నది.పాఠశాల స్థాయిలో ప్రణాళిక, పర్యవేక్షణ లోపాలతోనే ఇలా జరిగినట్టు అధికారులు గుర్తించారు. 60శాతం లోపు ఫలితాలొచ్చిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులిచ్చారు. మీపై క్రమశిక్షణ చర్యలెందుకు తీసుకోకూడదో స్పష్టంచేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఫలితాలు తక్కువగా రావడానికి కారణాలు ఏంటో తెలిపాలని కోరారు. ఫలితాలు మెరుగయ్యేందుకు తీసుకునే చర్యలతో పాటు విద్యార్థుల గైర్హాజరుకు కారణాలపై ఆరా తీశారు. కొందరు హెచ్‌ఎంలు ఎంఈవోలుగా అదనపు బాధ్యతల్లో ఉన్నారని, అనేక పనులు అప్పగించి షోకాజ్ నోటీసులివ్వడం ఎంత వరకు సబబని ఉపాధ్యాయ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ నోటీసులను ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.పాలమూరు కార్పొరేషన్‌పై పీఠముడి ఒకవైపు అధికారం, మరోవైపు పోలీస్ యంత్రాంగం సహకారం ఇంకోవైపు ఎన్నికల అధికారుల అండదండలతో తాము అనుకున్నది సాధించారు. అయినా మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో మెజార్టీకి దూరంగా నిలిచిపోయారు. ఎక్కడ మేయర్ పదవి చేజారుతుందో అన్న భయంతో రాత్రికి రాత్రి క్యాంప్ రాజకీయాలకు తెరలేపారు. అర్ధరాత్రి గెలిచిన కార్పొరేటర్లను క్యాంప్ ఆఫీసుకు పిలిపించి బస్సుల్లో ఆంధ్రాకు తరలించారు

# పాలమూరు కార్పొరేషన్‌పై పీఠముడి

- క్యాంప్ రాజకీయాలకు తెరలేపిన కాంగ్రెస్
- చైర్మన్ పదవులకు పాత, కొత్త అధికార పార్టీ నేతల కీచులాట
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో రసవత్తరంగా రాజకీయం
- మున్సిపాలిటీల్లో టెన్షన్.. టెన్షన్..
- గద్వాలలో హస్తం పార్టీ అరాచకం



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఒకవైపు అధికారం, మరోవైపు పోలీస్ యంత్రాంగం సహకారం ఇంకోవైపు ఎన్నికల అధికారుల అండదండలతో తాము అనుకున్నది సాధించారు. అయినా మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో మెజార్టీకి దూరంగా నిలిచిపోయారు. ఎక్కడ మేయర్ పదవి చేజారుతుందో అన్న భయంతో రాత్రికి రాత్రి క్యాంప్ రాజకీయాలకు తెరలేపారు. అర్ధరాత్రి గెలిచిన కార్పొరేటర్లను క్యాంప్ ఆఫీసుకు పిలిపించి బస్సుల్లో ఆంధ్రాకు తరలించారు.తెలంగాణ వార్తలుసీఎం సొంత జిల్లాలో అధికారం ఎక్కడ చేజారుతుందోనని భయంతో క్యాంప్ రాజకీయాలకు తెరలేపడం ఒక ఎత్తు అయితే ఆంధ్రాకు తీసుకెళ్లి క్యాంప్ పెడితే సేఫ్ అని ఏకంగా చీరాలకు తరలించారు. ఇక మిగతా మున్సిపాలిటీ లో అధికారం కైవసం చేసుకున్నా పాత, కొత్త కాంగ్రెస్ నేతల మధ్య పదవుల పంపకంపై పేచి మొదలైంది. ఇక గద్వాలలో అరాచకీయమే రాజ్యమేలింది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యే చేసిన పనికి ఎన్నికల అధికారులు సైతం వత్తాసు పలకడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు బీజేపీ ఒక్క అడుగు దూరంలో నిలిచింది. అయితే ఇండిపెండెంట్‌లను ప్రలోభ పెట్టి పార్టీలో చేర్చుకొని పీఠం ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో ఫార్వర్డ్ బ్లాక్ తరఫున పోటీచేసి గెలిచిన అభ్యర్థులకు అధికార పార్టీ ప్రలోభపెట్టి భారీ ఆఫర్ ఇచ్చి ఏకంగా సీఎం దగ్గరికి తీసుకెళ్లి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు.ఆ జిల్లాలో ఖాతా తెరిచేందుకు పెద్దఎత్తున ప్రలోభాలకు గురిచేసినట్లు విమర్శలు వస్తున్నాయి. ఇంత చేసినా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు వచ్చి న ఓటింగ్ శాతం చూసి అధికార పార్టీ కంగుతిన్నది. అధికార పార్టీతో పోలిస్తే బీఆర్‌ఎస్‌కు కేవలం 10శాతం మాత్రమే వ్యత్యాసం ఉంది. వార్డు స్థానాల్లో కూడా గులాబీ పార్టీ ప్రభంజనం సృష్టించింది. సీఎం సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు గెలిచిన ఆనందంలో పైశాచికత్వం ప్రదర్శిస్తూ అర్ధరాత్రి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఇంటికెళ్లి దాడికి దిగారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన మున్సిపల్ ఎన్నికలు.. ఇప్పుడు రణరంగాన్ని తలపించాయి. అడుగడుగునా నిబంధనలు తుంగలోకి తొక్కి అధికారం కైవసం చేసుకున్నారు.

### ఓటమిని జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్‌పై దాడులు

మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక చాలాచోట్ల బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి మున్సిపాలిటీలో విపక్షాలను బెదిరించి భయపెట్టి ఏకపక్షంగా ఓట్లు వేసుకున్నా అధికార పార్టీ నాయకులు అర్ధరాత్రి ఒకటో వార్డు బీఆర్‌ఎస్ అభ్యర్థి రాజశేఖర్ దంపతులపై దాడికి తెగబడ్డారు. ఎక్కడ ఓట్లు వేయకపోతే ఏమవుతుందోనని ప్రజలు కూడా భయపడాల్సిన పరిస్థితిని తీసుకొచ్చారు. మహబూబ్‌నగర్‌లో కూడా ఆయా డివిజన్‌లో హోరాహోరీ పోరు నడిచింది. అయితే బీఆర్‌ఎస్ గెలవడంతో ఓటమిని తట్టుకోలేక భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారికి గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు. మిగతా మున్సిపాలిటీలో కూడా కాంగ్రెస్ ఓటమి పాలు కావడంతో అక్కడక్కడ బెదిరింపులకు దిగారు. ఇక గద్వాలలో విపక్షాలు లేకుండా చేస్తామని ఫిరాయింపు ఎమ్మెల్యే అనుచరులు బాహాటంగా ప్రకటిస్తున్నారు.

### క్యాంపునకు తరలిన కార్పొరేటర్లు

మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మ్యాజిక్ ఫిగర్‌కు మూడు సీట్లు దూరంగా ఉన్న అధికార పార్టీ హడావుడిగా అర్ధరాత్రి కార్పొరేటర్లను క్యాంప్‌నకు తరలించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు బస్సుల్లో 28 మంది కార్పొరేటర్లను, కొందరు స్వతంత్ర కార్పొరేటర్లను తీసుకువెళ్లినట్లు సమాచారం. వీరందరిని తన రాజకీయ గురువు చంద్రబాబు పర్యవేక్షణ ఉంటుందని.. ఆంధ్రాకు పంపించారు. వీరందరిని ఒంగోలు జిల్లా చీరాల రిసార్ట్‌లో ఉంచినట్లు సమాచారం . వీరంతా మందు, విందులతో చిందులు వేస్తున్నారు.ఇదిలా ఉండగా డిప్యూటీ మేయర్ పదవిపై తీవ్ర పోటీ రావడంతో కొంతమంది కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీకి ఇవ్వాలని కొంతమంది.. పాత కాంగ్రెస్ నేతలకు ఇవ్వాలని మరికొంతమంది.. పట్టుబడుతున్నారు. అయితే మహబూబ్‌నగర్ జిల్లాలో 40ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు చేసిన బెనహర్ కూతురికీ డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తుంది. మరో ఆరుగురు డిప్యూటీ మేయర్ కోసం పోటీపడుతున్నారు. అసంతృప్తి తీవ్రస్థాయిలో పెరుగుతోందని సమాచారం. ఒకవేళ అదే జరిగితే మేయర్‌ను ఎన్నుకొని డిప్యూటీ మేయర్‌ను వాయిదా వేసేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.

### సత్తా చాటిన మాజీ మంత్రి

మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఒంటరి పోరాటం ఫలించింది. హోరాహోరీ పో రులో 16డివిజన్లను గెలుచుకున్నారు. నాలుగుస్థానాలు 25 ఓట్ల తేడాతో కోల్పోయారు. మరో మూడు స్థానాలు 100లోపు ఓట్ల తేడా తో ఓటమి పాలయ్యారు. ఈ సీట్లే గనక వస్తే కార్పొరేషన్‌లో బీఆర్‌ఎస్ కీలకంగా మారేది. ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తామని ప్రతిపక్ష పాత్రలు హుందాతనంగా పోషిస్తామని ప్రకటించారు. అంతేకాకుండా బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన పెండింగ్ పనులను పూర్తిచేసేలా ఒత్తిడి చేస్తామని.. కా ర్పొరేషన్ అభివృద్ధి చేసేందుకు పార్టీ తరఫున ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఇక మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చక్రం తిప్పారు. అమరచింతలో హంగ్ రావడంతో మ్యాజిక్ ఫిగర్‌కు అవసరమైన మెజార్టీని సాధించి బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తున్నారు. మొత్తంపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండేళ్లలో అధికార పార్టీకి తీవ్ర వ్యతిరేకత ఉత్పన్నం కావడం.. ప్రజలు కారుకే జై కొట్టడం చూస్తుంటే రాబోయే ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల్లో కూడా ఇదే విధమైన ఫలితాలు రాబోతున్నాయి అన్న సంకేతాలు వినిపిస్తున్నాయి.

## ఐఎస్ఎస్‌కు నలుగురు వ్యోమగాముల పయనం



కేప్ కెనావెరాల్, ఫిబ్రవరి 14:

వైద్యపరమైన అత్యవసర కారణాల వల్ల నలుగురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి అర్ధాంతరంగా భూమికి తిరిగొచ్చిన నేపథ్యంలో వారి స్థానాన్ని భర్తీ చేయడానికి తాజాగా మరో బృందం రోదసిలోకి పయనమైంది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన రాకెట్ ద్వారా వారు రోదసిలోకి బయల్దేరారు.

## బీఆర్‌ఎస్ మహిళా అభ్యర్థిపై దాడి.. తాగిన మైకంలో అర్ధరాత్రి రెచ్చిపోయిన కాంగ్రెస్ నేతలు

- సీఎం రేవంత్ ఇలాకా కోస్గి పట్టణంలో రౌడీ మాఫియా



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్‌ఎస్ మహిళా అభ్యర్థిపై కాంగ్రెస్ మూకలు దాడికి తెగబడిన ఘటన నారాయణపేట జిల్లాలో కోస్గి లో చోటుచేసుకున్నది. సీఎం ఇలాకాలోని కోస్గిలో శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ పూర్తయి ఫలితాలు ప్రకటించిన తర్వాత కాంగ్రెస్ రౌడీ మూకలు రెచ్చిపోయాయి. అర్ధరాత్రి సమయంలో 2వ వార్డు అభ్యర్థి అలవేణి రాజశేఖర్ ఇంటిపై దాడికి తెగబడ్డారు. గెలిచిన ఆనందంలో పైశాచికత్వంగా ప్రవర్తించారు.విచక్షణ లేకుండా.. మహిళ అని కూడా చూడకుండా.. ఆమెతోపాటు తన భర్తపై దాడికి దిగారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో కిడ్నాప్‌లు, బెదిరింపులు సర్వసాధారణంగా మారాయని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్తున్నారు.

## ఔఫ్‌ఎష్ట్ర: డ్యాన్సులతో ఊరేగింపుగా వెళ్తున్న పెళ్లి బృందం.. వారిపైకి దూసుకెళ్లిన లారీ



రాయ్‌పూర్: ఒక పెళ్లి బృందం డ్యాన్సులతో ఊరేగింపుగా పెళ్లి వేదిక వద్దకు వెళ్తున్నది. ఇంతలో ఒక లారీ వారిపైకి దూసుకొచ్చింది. మహిళలతో సహా పలువురు గాయపడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. (ఖతీబఎని =బఅం రాజవతీ ఋఅఎఆఅస్త్ర ×అ ధ్ఘుతీఘ్ఫ్) ఛత్తీస్‌గఢ్‌లోని జాంజ్‌గిర్–చంపా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక పెళ్లి బృందంలోని మహిళలు, పురుషులు డీజే పాటలకు అనుగుణంగా డ్యాన్స్ చేస్తున్నారు. ఎంతో సంతోషంగా పెళ్లి వేదిక వద్దకు ఊరేగింపుగా బయలుదేరారు.కాగా, ఉన్నట్టుండి పెళ్లి బృందంపైకి ఒక లారీ దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఒక వ్యక్తికి వెన్నెముక విరిగింది. ఇద్దరు మహిళలకు కాళ్ళు, ఛాతికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పెళ్లి బృందంపైకి లారీ దూసుకెళ్లిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## మునుగోడులో ఆరోగ్య లక్ష్మీ కమిటీ ఏర్పాటు



మునుగోడు, ఫిబ్రవరి 13 :

పౌష్టికాహారం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామ పంచాయతీల సర్పంచులకు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచ్ పాలకూరి రమాదేవి చైర్మన్‌గా 11 మంది సభ్యులతో కలిసి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకులు నాణ్యమైనవి అందజేయాలని, బాలింతలకు సరైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మున్సిపల్ పీఠం బీఆర్‌ఎస్‌దే.. ఎందుకంటే..?




నర్సాపూర్, ఫిబ్రవరి13:

నర్సాపూర్ చైర్మన్ పీఠం బీఆర్‌ఎస్ పార్టీకే దక్కే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. మున్సిపల్ ఓట్ల లెక్కింపులో ఏ పార్టీకి సంపూర్ణమైన మెజార్టీ రాకపోవడమే అందుకు కారణం. మొత్తం 15 వార్డులకు ఎన్నికలు జరుగగా.. బీఆర్‌ఎస్ పార్టీ 5, కాంగ్రెస్ పార్టీ 6, బీజేపీ 4 వార్న్?ల్లో విజయం సాధించాయి. దాంతో.. చైర్మన్ పీఠంపై ఉత్కంఠ నెలకొంది.ఏ పార్టీకి సంపూర్ణమైన మెజార్టీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలంటే కనీసం 8 మంది కౌన్సిలర్ల కోరం కావాలి. ఈ పరిస్థితుల్లో ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకంగా మారనున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీకి ఒక ఎమ్మెల్యే, ఇద్దరు ఎమ్మెల్సీలు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. దీంతో.. కోరం ప్రకారం 8 మంది మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకి ఉండడంతో చైర్మన్ పీఠందక్కించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

## అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యం

**కొనసాగుతున్న గాలింపు చర్యలు**

బెంగళూరు,ఫిబ్రవరి14 అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యమయ్యాడు. కర్ణాటకకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య (22) ఫిబ్రవరి 9 నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అతడి కోసం పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు.సాకేత్ బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. అతడు చివరిసారిగా క్యాంపస్‌కు కిలోమీటరు దూరంలో ఉన్న లేక్ అంజా సమీపంలో కన్పించినట్లు తెలుస్తోంది. అక్కడ అతడి పాస్‌పోర్టు, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాక్‌ప్యాక్‌లను అధికారులు గుర్తించారు. అతడిని గుర్తించేందుకు స్నేహితులతో కలిసి స్థానిక అధికారులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సాకేత్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నామని, వారికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. అమెరికా అధికారులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

## లాయర్ స్వప్న కేసులో నిందితుల అరెస్ట్

- హత్యకు ఉప యోగించిన కార్లు, ఫోన్లు స్వాధీనం
- భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసుల వెల్లడి

రంగారెడ్డి,ఫిబ్రవరి14 మొయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో న్యాయవాది స్వప్న హత్య కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ గోటికె స్వప్న ఫిబ్రవరి 4న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. న్యాయవాది స్వప్న హత్యకు భూ వివాదమే కారణమని నిర్ధారించారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులలో ప్రధాన నిందితుడు స్వప్న సొంత అన్న గోటికె రాజు మరో ముగ్గురు సహచరులతో కలిసి హత్యకు కుట్ర చేసినట్లు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ యోగేష్ గౌతమ్ చెప్పారు. సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై వివాదం. భూమి సర్వే కోసం వెళ్లిన సమయంలో నిందితులు స్వప్నపై దాడికి పాల్పడ్డారు. మొదటగా కారుతో ఢీకొట్టి, తర్వాత రాళ్లు,కర్రలతో దాడి చేసి అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేశారు. దీంతో ఘటన స్థలంలోనే స్వప్న మృతి చెందింది. హత్య అనంతరం ఇన్నోవా కార్, స్కూటీలో నిందితులు పరారయ్యారు. ఇన్నోవా కారు, స్కూటీ సీజ్ చేశారు. నలుగురు నిందితుల మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కొడవలిని కూడా సీజ్ చేశాం అని డీసీపీ యోగేష్ తెలిపారు.చెల్లిని చంపిన సొంత అన్న కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే స్వప్న అన్న రాజుతో పాటు ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్వప్న లొకేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ రెండు సార్లు స్వప్నను హత్య చేసేందుకు ప్రయత్నించినట్టు రాజు విచారణలో ఒప్పుకున్నాడు. ఒకసారి కారుతో మరోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీ కొట్టించే ప్రయత్నం చేశాడు రాజు. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్లాన్ చేశాడు. రెండు ఘటనల నుంచి స్వప్న తప్పించుకుంది. సీసీ కెమెరాలు లేని ప్రదేశాలు చూసి స్వప్నను వెనుక నుంచి ఢీ కొట్టేందుకు రాజు ప్లాన్ చేశాడు. ప్లాన్ సక్సెస్ చేసేందుకు తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. ఈ రోడ్డు ప్రమాదం కేసులను హత్యాయత్నం కేసులుగా పోలీసులు మార్చనున్నారు.

## ప్రదోష కాలమే పరమశివుడికి ప్రీతికరం

- ఆ సమయంలోనే పూజలు చేస్తే మంచిది

వేములవాడ,ఫిబ్రవరి14 తిథులలో త్రయోదశి, చతుర్దశి చాలా ప్రత్యేకమైనవి. శివరాత్రికి సంబంధించినంత వరకు 'ప్రదోష' కాలం చాలా ముఖ్యం. అంటే రాత్రి కాలం అని అర్థం. రాత్రి వేళ ప్రదోషంతో ప్రారంభమవుతుంది. అంటే... సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల మధ్య సమయం అన్నమాట. ఈ సమయంలో పరమేశ్వరుడిని పూజించినా, శివ పంచాక్షరీ ధ్యానం చేసినా మానసిక ప్రశాంతత లభిస్తుంది. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఇక, త్రయోదశికి మన్మథుడు, చతుర్దశికి కలి పురుషుడు అధిపతులు. వీరిరువురినీ నియంత్రించే శక్తి ఒక్క పరమేశ్వరుడికే ఉంది. అలాగే బుధ, గురువారాలు బుద్ధికీ, మాటకీ సంకేతం గనక... రోజూ కాకపోయినా ఈ రోజుల్లో, ఆ తిథుల్లో ప్రదోషకాలంలో శివారాధన చేయాలని చెబుతారు. 'ఓం నమః శివాయ' అని స్మరిస్తే చాలు కరిగిపోతాడు పరమశివుడు. భక్తితో ఓ సుమం సమర్పించినా సంతుష్టుడవుతారు. ఇక స్వామికెంతో ప్రీతి కరమైన ప్రదోష కాలంలో పూజిస్తే విశేష ఫలితాలు ఉంటాయి. ప్రదోషమంటే పాప నిర్మూలన. తెలిసీ తెలీక చేసే పాపకర్మల వల్ల ప్రతిబంధకాలను కొని తెచ్చుకున్నట్లవుతుంది. దాంతో పురోభివృద్ధికి ఉన్న అవకాశాలు పరిమితమౌతాయి. ఆ పాపకర్మలు నిర్జీవం కావాలంటే, దానికి తగ్గ పుణ్యకర్మలు చేయాలి. పరమశివుడు ప్రమథ గణాలతో కొలువయ్యుండే ప్రదోషకాలంలో శివుని స్మరిస్తే మన పాప కర్మల ఫలాన్ని తాను స్వీకరించి కష్టాలను తొలగిస్తాడనేది భక్తుల నమ్మకం. అందుకే ఉపవాసంత తరావత ప్రదోష కాలంలో అభిషేకాలు చేయాలి.

## రాయలసీమ ముఖచిత్రం మార్చింది తామే

- సీమ హార్టికల్చర్ హబ్‌కు 30వేల కోట్లు కేటాయింపు
- అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీగా అబివృద్ధి
- మీడియాతో చంద్రబాబు వెల్లడి

అమరావతి,ఫిబ్రవరి14:రాయలసీమ ముఖచిత్రం మార్చింది తామేనని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు 30వేల కోట్లు కేటాయించడం పట్ల ఎమ్మెల్యేలంతా సంతోషంగా ఉన్నారని సీఎం అన్నారు. సీఎం చంద్రబాబు అసెంబ్లీ లాబీలో మీడియాతో మాటామంతీ జరిపారు. ఈ సందర్భంగా అమరావతి అభివృద్ధిపైనా, ప్రకాశం, రాయలసీమ అభివృద్ధి మీద కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం ఇంకా వైసీపీ పాలనలో వచ్చిన విధ్వంసం నుంచి పూర్తిగా కోలుకోవడానికి సమయం పడుతుందన్న చంద్రబాబు.. ప్రస్తుత బడ్జెట్ మెరుగైనది అయినప్పటికీ సమస్యలు ఎన్నో ఉన్నాయని అన్నారు. అమరావతి విషయంలో చంద్రబాబు మాట్లాడుతూ, రెండు, మూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుందని, రాజధానిని జాతీయ రహదారులకు అనుసంధానిస్తున్నామని చెప్పారు. దీంతో రాకపోకలు పెరిగి ఆదాయం వస్తుందని వివరించారు. రాజధాని అమరావతికి పశ్చిమ బైపాస్ వల్ల యాక్సెస్ పెరిగిందని, ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌లతో మరింత యాక్సెస్ మెరుగుపడుతుందని సీఎం పేర్కొన్నారు. 'ఇది అమరావతిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఉంటుంది. ఇది కేవలం రాజధాని నగర అభివృద్ధి మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కీలకం'. అని చంద్రబాబు చెప్పారు. కూటమి ప్రభుత్వం అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా తీర్చిదిద్దుతోందని సీఎం తెలిపారు. ఇటీవల క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన చేసి, అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా మార్చాలనే లక్ష్యం ప్రకటించామని.. ఇది హైదరాబాద్ ఐటీ రివల్యూషన్‌తో పోల్చదగిన మరో విప్లవం అవుతుందని ఆయన అన్నారు. ప్రపంచంలో టాప్-3 క్వాంటం వ్యాలీల్లో అమరావతి ఒకటిగా నిలవాలనేది మన దీర్ఘకాలిక దృష్టి అని చంద్రబాబు తెలిపారు. అదే సమయంలో, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరకని రాయలసీమలో ఇప్పుడు దేశంలోనే ఉత్తమ పండ్లు ముఖ్యంగా దానిమ్మ పండుతున్నాయని, అప్పుడు తెచ్చిన హంద్రీ-నీవా ప్రాజెక్టు ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని చెప్పారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు.. 500 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు.

# తొలిదశ పార్లమెంట్ సమావేశాలు ముగింపు



హైదరాబాద్,ఫిబ్రవరి14 పార్లమెంట్ బడ్జెట్ తొలిదశ సమావేశాలు ముగిసాయి. యధావిధిగా రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ ప్రసంగం, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం వంటివన్నీ యథాలాపంగా ముగించేశారు. నానాటికి తీసికట్టు నాగంబొట్లు అన్నట్లుగా..ఈ సమావేశాలను కూడా మొక్కుబడిగానే ముగించేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో పెద్దగా మెరుపేలమీ లేవు. ప్రభుత్వం చెబుతన్నదే చర్వితచరణంగా చెబుతున్నారు. ఇకపోతే స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం ఒకటి ఈ సమావేశాల్లో ప్రధాన అంశంగా మారింది. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన ప్రతిపక్షం ఆరోపణగా ఉంది. స్పీకర్, ప్రభుత్వానికి సంబంధించినంత వరకు ఇదో మరక లాంటిదే. చరిత్రలో ఫలానా స్పీకర్ తీరుపై అవిశ్వాసం పెట్టారని గుర్తుండిపోతుంది.నిజానికి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఎంతో ముఖ్యమైనవి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలోనే అనేక విషయాలు ప్రస్తావనకు వస్తాయి. పాలకపక్షాన్ని విపక్షాలు నిలదీస్తాయి. విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. అలాగే అవకాశం వచ్చేలా విపక్షం కూడా వ్యవహరించడం లేదు. చర్చ జరిగితే ప్రజల సమస్యలు దేశానికి తెలిసేవి. కానీ మొక్కుబడి సమావేశాలు సాగుతున్న తీరు దురదృష్టకరం. రాష్ట్రపతి ప్రసంగంపై రాజ్యసభలోనే ప్రధాని సమాదానం చెప్పి సరిపుచ్చారు. మోడీ అధికారంలోకి వచ్చాక విపక్షాల సమస్యలను ఆకళింపు చేసుకోవడమో లేదా, వారినుంచి చర్చను ఆహ్వానించడమో జరగడం లేదు. అర్థవంతమైన చర్చలను చూసి పార్లమెంట్ ఎన్నో ఏళ్లు గడిచి పోతున్నాయి. పార్లమెంటుకు ప్రధాని సమాధానం ఇవ్వకపోవడం చాలా బాధాకరం. ప్రతిపక్ష నేతగా రాహుల్ ప్రసంగానికి కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఇకపోతే విపక్షనేతను పార్లమెంట్‌కు అనర్హుడిని చేయాలని బిజెపి సభ్యుడు కూడా ప్రతిపాదించడం కేవలం కక్షసాధింపు చర్యగానే చూడాలి. తమ తప్పుల్ని కప్పి పుచ్చుకోవడానికి, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి పాలకపక్షం చేస్తున్న ప్రయత్నాలు ఎంతోకాలం సాగవని గుర్తించాలి. అమెరికాతో ఒప్పందం కావచ్చు, యూరోపియన్ యూనియన్‌తో ఒప్పందం కావచ్చు..పార్లమెంటు చర్చించాల్సి ఉంది. ప్రభుత్వ తీసుకుంటున్న నిర్ణయాలపై చర్చ సాగాలి. కానీ అలా సాగడం లేదు. అధికార పార్టీ నేతలు అడుగడుగునా రాహుల్ గాంధీ నిలదీసి ప్రశ్నిస్తున్నారు. దానిబదులు అతను ఏం చెబుతాడో తెలుసుకుంటే బాగుండేది. రాహుల్ గాంధీ ఇస్తున్న వాయిదా తీర్మానాలు ఎలాగూ చర్చకు రావడం లేదు. కనీసం మరో విధంగా చర్చకు తీసుకునే అవకాశం గురించి రాహుల్ ఆలోచించడం లేదు. ఒకవేళ సమస్యలపై సిరయస్‌గానే చర్చ జరగాల్సి ఉంటే అందుకు అనేక రకాల మార్గాలు ఉన్నాయి. రూల్స్ పొజిషన్ ఉంది. అలా చర్చను కోరే అవకాశం సులువు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం పేర నడుస్తున్న ప్రహసనంలో ఏం జరిగిందో దేశ ప్రజలకు తెలియాలి. అమెరికా మధ్యంతర ఒప్పందం కారణంగా దాని ప్రభావం మనదేశ రైతాంగంపై పడుతుందన్న భావన ఉంది. అలాంటిదేమీ లేదని పాలకవర్గం చెబుతోంది. అవే విషయం పార్లమెంట్ వేదికగా చెప్పివుంటే బాగుండేది. దేశ ఉత్పత్తులపై సుంకాన్ని జీరో శాతానికి తేవడం అంటే.. ఇక్కడి చిన్న, సన్నకారు వ్యవసాయదారుల్ని, వ్యాపారుల్ని రోడ్డున పడేయడమేనని అంటున్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలకు పార్లమెంట్ చర్చల ద్వారా పరిష్కారం చూపాల్సి ఉంది. అమెరికాతో వాణిజ్య ఒప్పంద నిర్ణయం చిన్నవిషయం కాదు. ఇది కేవలం మోడీకి సంబంధించినది అస్సలే కాదు. పార్లమెంటును విశ్వాసం తీసుకోవాల్సింది. కీలకమైన విషయాల్లో ఈ దేశ పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోవడం అవసరం. కానీ అలా జరగడంలేదు. వాణిజ్య ఒప్పందం కోసం రష్యాతో చమురు కొనుగోళ్లు తగ్గించినా అమెరికా మనల్ని పాకిస్తాన్‌తో సమానంగా చూడడం దురదృష్టకరం. ఇప్పుడు ప్రధానిగా ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మోడీపై ఉంది. అనేక సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌కు అవకాశం కల్పించాలి. ప్రజల అనుమానాలు నివృత్తి చేయాలి. దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నట్లు వస్తున్న ఆరోపణలకు సవివరమైన సమాధానం రావాల్సి ఉంది. అప్పుడే పార్లమెంట్‌కు విలువ ఉంటుంది. ఇందుకు తాము అనుగుణంగా ఉన్నామా లేమా అన్నది ఇరుపక్షాలు బేరీజు వేసుకోవాల్సి సమయం కూడా.

# శివరాత్రి రుద్రుడికి ప్రీతకరం


**ఉపవాసంతో స్వామికి అర్చన మంచిది**



ద్రాక్షారామం,ఫిబ్రవరి14 శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహా శివరాత్రి. హిందువులు పెద్ద పండుగల్లో శివరాత్రి ఒకటి. పార్వతీదేవిని శివుడు పెళ్లాడిన రోజునే ఈ పండుగగా జరుపుకుంటారు. అలాగే శివపురాణంలో మహాశివరాత్రికి సంబంధించి ఇంకొన్ని కథలు కూడా ఉన్నాయి. మాఘమాసంలోని కృష్ణ పక్ష చతుర్దశి రోజున మహా శివరాత్రి వస్తుంది. ఈ రోజున శివుడిని భక్తి, పూజలతో కొలిస్తే అంతా మంచి జరుగుతుందని నమ్ముతారు. ఈ ఏడాది అలాంటి పవిత్రమైన రోజు ఫిబ్రవరి 15న వచ్చింది. దేశమంతటా శివాలయాల్లో పెద్ద ఎత్తున శివరాత్రి సంబరాలు జరుగుతుంటాయి. శివరాత్రి అనగానే అందరికీ వెంటనే గుర్తొచ్చేది. ఉపవాసం, జాగరణ. ఈ రోజున ఉపవాసం ఉండి, రాత్రి జాగరణ చేస్తే పుణ్యం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు.శివరాత్రి నాడు తెల్లవారుజామునే లేచి, స్నానం చేసి ఆ తర్వాత శివరాత్రి వ్రతాన్ని మొదలుపెట్టాలి. ఈ వ్రతం చేసేటప్పుడు ఉపవాసం, జాగరణం, బ్రహ్మచర్యం అనే నియమాలు పాటించాలి. ఇంట్లోనే గానీ, ఆలయంలోగానీ వ్రతాన్ని ఆచరించవచ్చు. రాత్రంతా జాగరణం ఉండి, ఉదయాన్నే స్నానం చేశాక మళ్లీ పూజ చేసి వ్రతాన్ని విడవాలి. అన్నం లాంటి రోజూ తీసుకునే ప్రధాన ఆహారం కాకుండా పాలు, పండ్లు మాత్రమే, అదీ సాయంత్రం పూటనే తీసుకోవాలి. ఇతరులతో దైవ సంబంధమైన మాటలనే ఎక్కువగా మాట్లాడితే మంచిది. ఓం నమః శివాయ మంత్రాన్ని జపిస్తూ ఉండాలి.

అనారోగ్యంతో ఉన్నప్పుడు ఉపవాసం ఉండకండి.మహా శివరాత్రి నాడు భక్తులు ఉపవాస దీక్షను పాటిస్తారు. చాలామంది కఠినంగా ఉండి.. కనీసం నీరు కూడా తాగరు. దీనిని నిర్జల ఉపవాసం అంటారు. కొంతమంది పాలు పండ్లు లాంటి సాత్విక ఆహారం తీసుకుంటారు. ప్రస్తుతం జీవన ప్రమాణాల దృష్ట్యా పెరుగు, మజ్జిగ, కొబ్బరి నీరు డ్రై ఫ్రూట్స్ వంటివి కూడా తినవచ్చు. శివరాత్రి మరుసటి రోజు సూర్యోదయం అయిన తరువాత ఉపవాస దీక్షను విరమించాలి. మహాశివరాత్రి ఉపవాస సమయంలో కొన్ని ఆహారాలను ఖచ్చితంగా తినకూడదు. వీటిలో గోధుమలు, బియ్యం, పప్పులు మరియు పప్పుధాన్యాలు వంటి ధాన్యాలు ఉన్నాయి. ఉల్లిపాయలు, వెల్లుల్లి , ఉడికిన పదార్ధాలను తినకూడదు. ఇంకా వీటితో పాటుగా మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలని పండితులు చెబుతున్నారు. శివరాత్రికి చేసే జాగరణ మనలో ఉన్న శివత్వాన్ని జాగృతం చేస్తుంది. జాగరణం మనలో ఉన్న శివుడిని జాగృతం చేస్తుంది, తమస్సును తొలగిస్తుంది. సినిమాలు చూస్తునో, పిచ్చి కబుర్లు చెప్పుకుంటూనో, కాలక్షేపం చేస్తూనో చేసే జాగరణకు అది జాగరణ అవ్వదు, కాలక్షేపం మాత్రమే అవుతుంది. అప్పుడు పుణ్యం రాకపోగా, ఆ సమయంలో మట్లాడిన చెడు మాటల వలన పాపం వస్తుంది. శివరాత్రి మరునాడు ఉదయం శివాలయాన్నిసందర్శించి, ప్రసాదం తీసుకుని, ఇంటికి వచ్చి భోజనం చేసి ఉపవాస వ్రతం ముగించాలి. అందరూ గుర్తుపెట్టుకోవలసిన ముఖ్య విషయం, శివరాత్రి నాడు ఉపవాసం, జాగరణ చేసినవారు, తరువాత రోజు రాత్రి వరకు నిద్రించకూడదు. అప్పుడే సంపూర్ణఫలం దక్కుతుందని చెప్తారు.

## శ్రీశైలంలో వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు



**పుష్పపల్లకిపై దర్శనమిచ్చిన మల్లికార్జునుడు**

శ్రీశైలం,ఫిబ్రవరి14 శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వైభవంగా జరుగుతున్నాయి. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి అమ్మవారు పుష్పపల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పపల్లకిలో శ్రీస్వామి అమ్మవారికి అర్చకులు వేదపండితులు ఆలయ చైర్మన్, సభ్యులు,ఈవో శ్రీనివాసరావు ప్రత్యేకపూజలు నిర్వహించి హారతులిచ్చారు. విద్యుత్ దీపకాంతుల నడుమ శ్రీశైలం పురవీధులలో శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్సవానికి తరలుతుండగా... ఉత్సవం ముందు కోలాటాలు డమరక నాధాలతో పలు రకాల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం ఎదుట పలు రకాల పుష్పాలతో దేదీప్యమానంగా సర్వాంగ సుందరంగా తయారుచేసిన పుష్పపల్లకిలో శ్రీస్వామి అమ్మవార్లు గ్రామోత్సవంలో భక్తులను కనువిందు చేశారు గంగాధర మండపం దగ్గర పుష్పపల్లకిలో ఉన్న శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక హారతులిచ్చి అనంతరం అంకాలమ్మ గుడి,నంది మండపం బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవం కన్నులపండువగా సాగింది. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు పుష్పపల్లకిపై ఉన్న శ్రీస్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలర్పించారు.

## లోకేశ్ కనగరాజ్ హీరోగా డిసి




'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నటుడిగా మారబో తున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ' . ఈ సినిమాకు అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. సన్ పిక్చర్స్ నిర్మిస్తుంది. లోకేశ్ కనగరాజ్ సరసన వామికా గబ్బీ కథానాయికగా నటిస్తుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను వాలంటైన్స్ కానుకగా విడుదల చేసింది చిత్రయూనిట్. గ్లింప్స్ లో లోకేష్ కనగరాజ్ ఇంటెన్స్ అండ్ రా లుక్ లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. లోకేష్ ఇందులో దేవదాస్ పాత్రలో కనిపించబోతున్నాడు.

## ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విజయం



టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా నేడు కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ అద్భుత విజయం సాధించింది. 5 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తుచేసింది. వెస్టిండీస్ చేతిలో ఓటమి తర్వాత డీలా పడ్డ ఇంగ్లాండ్‌కు ఈ గెలుపు టానిక్‌లా పనిచేసింది. మొదట బౌలింగ్లో అదిల్ రషీద్ మాయ చేయగా, ఛేజింగ్ లో టామ్ బాంటన్ వీరోచిత ఇన్నింగ్స్ తో జట్టును గెలిపించాడు. స్కాట్లాండ్ నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మరో 10 బంతులు మిగిలి ఉండగానే, 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ గెలుపుతో ఇంగ్లాండ్ తన సూపర్-8 అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ సారథి హ్యారీ బ్రూక్ బౌలింగ్ ఎంచుకోవడంతో స్కాట్లాండ్ బ్యాటింగ్ కు దిగింది. ఇంగ్లీష్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు స్కాట్లాండ్ బ్యాటర్లు నిలవలేకపోయారు. ఆ జట్టు నిర్ణీత 19.4 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌట్ అయ్యింది. స్కాట్లాండ్ తరపున రిచీ బెరింగ్టన్ 49 పరుగులతో ఒంటరి పోరాటం చేయగా, టామ్ బ్రూస్ 24 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో వెటరన్ స్పిన్నర్ అదిల్ రషీద్ 36 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. పేసర్ జోఫ్రా ఆర్చర్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి స్కోరును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (2), జాస్ బట్లర్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఆ తర్వాత వచ్చిన జాకబ్ బెథెల్, కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా స్వీప్ షాట్లకు ప్రయత్నించి వికెట్లు పారేసుకున్నారు. దీంతో ఇంగ్లాండ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. అయితే ఈ దశలో క్రీజులోకి వచ్చిన టామ్ బాంటన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 41 బంతుల్లోనే అజేయంగా 63 పరుగులు చేశాడు. ముఖ్యంగా మార్క్ వాట్ వేసిన ఒకే ఓవర్లో మూడు భారీ సిక్సర్లు బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. సామ్ కరన్ (28) అతనికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో విల్ జాక్స్ విన్నింగ్ షాట్ కొట్టి లాంఛనం పూర్తి చేశాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడిన టామ్ బాంటన్ కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ గ్రూప్-సి పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపచుకుని తదుపరి దశకు వెళ్లే అవకాశాలను పెంచుకుంది. మరోవైపు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ స్కాట్లాండ్ కు నిరాశే మిగిలింది.

## దమ్ముంటే అభిషేక్ శర్మను ఆడించండి'

సూర్యకు పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా సవాల్!

టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఆదివారం కొలంబో వేదికగా జరగనున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు ముందు మైండ్ గేమ్స్ మొదలయ్యాయి. పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా, టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు ఓ ఆసక్తికరమైన సవాల్ విసిరారు. టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ గత నమీబియా మ్యాచ్‌కు ముందు కడుపులో నొప్పి కారణంగా దూరమైన సంగతి తెలిసిందే. అయితే పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా మాత్రం అభిషేక్ కోలుకోవాలని, అతను భారత్ తుది జట్టులో ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించాడు. "అభిషేక్ శర్మ రేపటి మ్యాచ్ ఆడాలని నేను కోరుకుంటున్నాను. అతను త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. మేము అత్యుత్తమ ఆటగాళ్లతోనే పోటీ పడాలనుకుంటున్నాము" అని పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా మీడియా సమావేశంలో పేర్కొన్నాడు. గత ఆసియా కప్‌లో పహల్గాం దాడికి నిరసనగా భారత జట్టు పాక్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. ఇది అప్పట్లో పెద్ద వివాదానికి దారితీసింది.

## పాకిస్తాన్ తో కీలక మ్యాచ్ కోసం

# టీమిండియా కసరత్తు

- సమాలోచనలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్
- నలుగురు కీలక ప్లేయర్లు బరిలోకి దిగే చాన్స్
- నేడు కొలంబోలో పాక్ తో ఇండియా మ్యాచ్



2026 టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్‌తో జరిగే కీలక పోరుకు భారత జట్టు సిద్ధంగా ఉంది. ఈ బ్లాక్‌బస్టర్ మ్యాచ్ కోసం కోచ్ గౌతమ్ గంభీర్ ఓ మాస్టర్ ప్లాన్ రూపొందించాడు. ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఒకేసారి నలుగురు మ్యాచ్ విన్నింగ్ స్పిన్నర్లను రంగంలోకి దింపేందుకు సిద్ధమయ్యాడు. అంటే, ఫిబ్రవరి 15న కొలంబోలో జరిగే మ్యాచ్‌లో కోచ్ గౌతమ్ గంభీర్ తన స్పిన్ అస్త్రాలను పాకిస్థాన్ జట్టుపై ప్రయోగించేందుకు సిద్ధమయ్యాడు. భారత స్పిన్ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తిగా ఫిట్ గా ఉన్నాడు. జట్టులో చేరాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో సుందర్‌కు ఆడే అవకాశం రాలేదు. కానీ, కోచ్ గౌతమ్ గంభీర్ ఈ యువ స్పిన్ ఆల్ రౌండర్‌ను పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో నేరుగా బరిలోకి దించవచ్చని భావిస్తున్నారు. సుందర్ తన బౌలింగ్ తోనే కాదు, బ్యాటింగ్ ఆర్డర్‌లో భారీ షాట్లు కూడా కొట్టగలడు. ఇది మ్యాచ్‌లో కీలకం అవుతుంది. 2026 టీ20 ప్రపంచ కప్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం ఇవ్వలేదు. అయితే, కుల్దీప్ యాదవ్ ఆర్. ప్రేమదాస స్టేడియంలో పాకిస్థాన్‌పై ఆడే ఛాన్స్ ఉంది. పాకిస్తాన్‌తో జరిగిన 3 టీ20 మ్యాచ్‌ల్లో కుల్దీప్ 8 వికెట్లు పడగొట్టాడు. అదే సమయంలో 6.58 ఎకానమీ రేటును కూడా కొనసాగించాడు. అందుకే కోచ్ గౌతమ్ గంభీర్ కుల్దీప్‌ను ఎలాగైనా ఆడించాలని కోరుకుంటాడు. గతంలో పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టిన ఆర్. ప్రేమదాస పిచ్‌పై కుల్దీప్ యాదవ్ భారత్‌కు గేమ్ ఛేంజర్‌గా నిరూపించబడవచ్చు. భారత జట్టు వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ పాత్ర పాకిస్తాన్ పై చాలా ముఖ్యమైనది కానుంది. ఎందుకంటే, అక్షర్ తన ఎడమ చేతి వేలు స్పిన్ తో పాకిస్తాన్ ను ఇబ్బంది పెట్టడమే కాకుండా, బ్యాట్ తో భారీ ఇన్నింగ్స్ ఆడే సామర్థ్యం కూడా కలిగి ఉన్నాడు. పాకిస్థాన్‌తో జరిగే బిగ్ మ్యాచ్‌లో అక్షర్ పటేల్ తన నాలుగు ఓవర్లలో వీలైనన్ని ఎక్కువ వికెట్లు తీయాలని లక్ష్యంగా పెట్టుకుంటాడు. కోచ్ గౌతమ్ గంభీర్ మాస్టర్ ప్లాన్ ప్రకారం, అక్షర్ ఈ ప్రయత్నంలో కీలక ఆటగాడు కావొచ్చు. కుడిచేతి వాటం మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్పిన్ చాలా మంది బ్యాట్స్‌మెన్‌లకు అర్థం కాదు. అయితే, స్పిన్-ఫ్రెండ్లీ ఆర్. ప్రేమదాస పిచ్‌పై, వరుణ్ మరింత ప్రమాదకరమైన బౌలర్‌గా మారవచ్చు. పాకిస్థాన్‌తో జరిగిన నాలుగు టీ20ఐలలో వరుణ్ కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసుకున్నప్పటికీ, 2026 ప్రపంచ కప్‌లో తన గణాంకాలను మార్చుకోవాలని చూస్తున్నాడు. 2026లో భారతదేశం తరపున ఐదు మ్యాచ్‌ల్లో వరుణ్ ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. అతని ఎకానమీ రేటు కేవలం 7.72 మాత్రమే.


## ఏప్రిల్ 1న పెళ్లి నిజమే

### ర్యూమర్స్‌పై చమత్కరించిన మృణాళ్ ఠాకూర్

సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాల్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాల్ గతంలో 'మేము కేవలం మంచి స్నేహితులమే' అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు. ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ ఠాకూర్‌ను ఈ విషయంపై ప్రశ్నించారు. ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?' అని అడగగా మృణాల్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. ఫిబ్రవరి 14 కాదు ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!' అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడు తూ, 'ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు 'మృణాల్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇది నిజంగా భయంకరంగా ఉంది' అని చెప్పింది.

## ప్రియురాలికి హార్ధిక్ పాండ్యా

# మరిచిపోలేని జ్ఞాపకం





ఫిబ్రవరి 15న పాకిస్తాన్‌తో హైవోల్టేజ్ ఉన్నప్పటికీ భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మకు ఈ వాలెంటైన్స్ డేని మరింత ప్రత్యేకంగా మార్చారు. తన గర్ల్‌ఫ్రెండ్ పేరులోని మొదటి అక్షరం 'వీ'ని తన మెడ వెనుక భాగంలో పాండ్యా టాటూ వేయించుకున్నాడు. ఈ టాటూను సెలబ్రిటీ టాటూ ఆర్టిస్ట్ సన్నీ భానుశాలి, లీడ్ ఆర్టిస్ట్ తుషార్ మరానే రూపొందించారు. హార్దిక్ ఎం అక్షరంతో కొత్త టాటూ మహికా శర్మపై తన ప్రేమను వ్యక్తం చేస్తోంది. ఈ వాలెంటైన్స్ డే ఆమెకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఫ్యాన్స్ సైతం కామెంట్లు చేస్తున్నారు. టీమ్ సమాచారం ప్రకారం, హార్దిక్ పాండ్యా మొదట మహికా కోసం కేవలం ఒక చిన్న టాటూ వేయించుకోవాలని అనుకున్నాడు. కానీ వారు తమ రిలేషన్, ఒకరి గురించి ఒకరు మాట్లాడుకుంటున్నప్పుడు, ఆ ఐడియా పెద్దదిగా మారింది. చివరికి వాలెంటైన్స్ డే గిఫ్ట్ గా మారింది. టాటూలో మీరు గమనిస్తే.. 2 చిరుతపులులు ఉన్నాయి. మొదటి చిరుతపులి చాలా పవర్‌ఫుల్, నేచురల్‌గా కనిపిస్తుంది. ఇది హార్దిక్ పాండ్యా బలాన్ని, శ్రమను సూచిస్తుంది. రెండో చిరుతపులి లైన్ ఆర్ట్‌లో రూపొందించారు. ఇది మొదటి చిరుత చుట్టూ తిరుగుతున్నట్లు ఉంటుంది. తన గాళ్‌ఫ్రెండ్ మహికా పేరులోని మొదటి అక్షరం 'వీ' స్పష్టంగా కనిపిస్తుంది. హార్దిక్ మొదట కేవలం మహికా పేరులోని మొదటి అక్షరాన్ని మాత్రమే టాటూ వేయించుకోవాలని భావించాడని సన్నీ భానుశాలి తెలిపారు. కానీ మాట్లాడుతున్న సమయంలో వారి బంధంలోని ఒక స్పెషల్ స్టోరీ బయటకు వచ్చింది. వారు ఒకరికొకరు బలాన్ని అందించే పార్ట్‌నర్స్ కావాలని భావించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అర్థవంతంగా చూపించడానికి చిరుతపులి టాటూ సరైన చిహ్నంగా మారింది. ఈ టాటూ కేవలం ఫ్యాషన్ కోసం మాత్రమే కాదు. కొన్ని టాటూలు కేవలం అడిగితే, లేక ఎవరైనా సూచిస్తే వేసుకుంటారు. కానీ కొన్ని వాటంతట అవే రూపుదిద్దుకుంటాయి. హార్దిక్ ఈ టాటూ నమ్మకంతో పాటు భావోద్వేగంతో తయారైంది. టాటూ ఏదైనా రియల్ స్టోరీని ప్రతిబింబించినప్పుడు, అది కేవలం రంగుగా మాత్రం మిగిలిపోదు. వారికి, ప్రియమైన వ్యక్తికి అది ఒక జ్ఞాపకంగా మారుతుంది. హార్దిక్ పాండ్యా గత ఏడాది 2025లో మహికా శర్మతో తన రిలేషన్ పై స్పందించాడు. ప్రస్తుతం వీరు ప్రేమలో మునిగి తేలుతున్నారు. గతంలో హార్దిక్ పాండ్యా విదేశీ మోడల్, బాలీవుడ్ నటి నటాషా స్టాంకోవిచ్‌ను వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ మే 2020లో ఇంట్లోనే సాధారణంగా వివాహం చేసుకోగా, ఫిబ్రవరి 2023లో రాజస్థాన్‌లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వైభవంగా పెళ్లి చేసుకున్నారు. ఏడాదిన్నరలోనే కథ ముగిసింది. అభిప్రాయభేదాలు రావడంతో జూలై 2024లో వారు విడిపోతున్నట్లు ప్రకటించారు. వీరికి కుమారుడు అగస్త్య ఉండగా.. బాలుడి బాధ్యతలను ఇద్దరూ చూసుకుంటున్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609